Follow: @ANNTELUGU
13-08-2025
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 250 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్




## నిజం సింహం లాంటిది..
- కేటీఆర్ లీగల్ నోటీసులపై బండి సంజయ్ రియాక్షన్

02




ఖమ్మంకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పుడు
## నల్గొండకు ఉంటే తప్పేంటి..?
- నాకు హామీ ఇచ్చినపుడు మా అన్న ఉన్న విషయం తెలియదా?
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అల్టిమేటం

02




## ఏపీలో పదవుల జాతర
- సెకండ్ ఫేజ్ లో 31 కార్పోరేషన్లకు ఛైర్మన్లు
- తొలివిడత 62 మందికి పదవులు

02



# ఎన్టీఆర్‌ను ట్రోలేస్తున్నారు
## టార్గెట్ చేసిన టీడీపీ ఫ్యాన్స్
### వార్-2 రిలీజ్ ముందు ఫ్యాన్ వార్
### నన్నెవరూ ఆపలేరంటూ వార్నింగ్ ఇచ్చిన ఎన్టీఆర్
### జై ఎన్టీఆర్.. జై హరి కృష్ణ అంటూ ప్రసంగం
### ఎన్టీఆర్ కు మద్దతుగా వైసీపీ ఫ్యాన్స్

**హైదరాబాద్, మహా:**

జూనియర్ ఎన్టీఆర్ ను ట్రోలేస్తున్నారు. నందమూరి తారక రామారావు మనవడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు జూనియర్ ఎన్టీఆర్. అంచలంచెలుగా ఎదుగుతూ గ్లోబల్ స్టార్ ఇమేజ్ ను సొంతం చేసుకున్నాడు. ఒక హీరో అన్నాకా.. అభిమానులు ఉంటారు.. ట్రోలర్స్ ఉంటారు. ఎన్టీఆర్ విషయంలో కూడా అంతే.. ఆయనకు ఎంతమంది అభిమానులు అయితే ఉన్నారో.. అంతే ట్రోలర్స్ కూడా ఉన్నారు. మొదటి నుంచి కూడా ఎన్టీఆర్ అంటే గిట్టనివాళ్ళు సోషల్ మీడియా లో చాలామందే ఉన్నారు.

మిగతా 3లో

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,400 |
| 22 క్యారెట్ | 92,950 |
| సిల్వర్ (కేజీ) | 1,15,000 |



# మహేష్ దూకుడు
## తగ్గేదెలే అంటున్న పీసీసీ చీఫ్
### ఓ వైపు పార్టీ కార్యక్రమాలు.. మరోవైపు సర్కారు పథకాల ప్రచారం
### హైకమాండ్ ఆశీస్సులతో దూసుకుపోతున్న లీడర్
### తొలివిడత పాదయాత్ర సక్సెస్
### 24 నుండి రెండవ విడతకు రెడీ
### పాదయాత్రపై రాహుల్, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ అభినందనలు
### క్యాడర్ లో ఉత్సాహం నింపేలా సాగుతున్న కార్యక్రమాలు
### మంత్రులతో ముఖాముఖి సూపర్ హిట్.. ప్రతిరోజు గాంధీభవన్ కు ప్రజాప్రతినిధులు

(కంది రామచంద్రారెడ్డి)

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తన విలక్షణ పనితీరుతో అటు ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ.. స్టేట్ పాలిటిక్స్ లో తగ్గేదెలే అని దూసుకుపోతున్నాడు. గతంలో ఏ పీసీసీ చీఫ్ చేయనన్ని విలక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీలో పాదయాత్రకు అనుమతి రావాలంటే.. ఎంతో కష్టమైన ప్రయాస. గతంలో వైఎస్సార్, సీఎం రేవంత్, భట్టి విక్రమార్క లాంటి నేతలు పాదయాత్రలు చేసినా.. హైకమాండ్ అనుమతి కోసం ఎంతో ముందస్తు ప్లాన్, ఎన్నో నెలలు.. సంవత్సరాల ప్లానింగ్ ఉండేది. కానీ మహేష్ గౌడ్ పీసీసీ చీఫ్ గా జనహిత పాదయాత్ర చేపట్టి సంచలనమే అయ్యాడు. మొదట ఇది ఇన్ ఛార్జి మీనాక్షి పాదయాత్రగా ప్రచారం జరిగినా, పీసీసీ చీఫ్ మహేష్ జనహిత పాదయాత్రగా తేలింది. ఇపుడు రెండోవిడత పాదయాత్రకు పీసీసీ చీఫ్ రెడీ అయ్యారు. హైకమాండ్ మన్ననలు విశ్వాసం ఎంతో ఉంటే గానీ కాంగ్రెస్ లాంటి పార్టీలో ఇలాంటి అవకాశం దక్కదు. పీసీసీ చీఫ్ గా మహేష్ పనితీరుకు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై ఏఐసిసికి, రాహుల్ గాంధీకి ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు.

వివరాలు 2లో



# భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వ సిబ్బందికి మూడు రోజుల సెలవులు రద్దు
## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
**ఆకస్మిక వరదలు వస్తే ఆదుకునేందుకు సన్నద్ధంగా ఉండాలని హైడ్రాకు ఆదేశం**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావ జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల సేవలు వాడాలని సూచించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్ లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు ఉండేలా చూసుకోవాలని, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో

మిగతా 2లో



## బీజేపీలో చేరుతున్నారా ఇవి తెలుసుకోండి
### టికెట్ గ్యారెంటీ ఉండదు..
మీ అనుచరులకు పదవులు దక్కవు..
కొత్తగా పార్టీలో చేరేవారికి రాజాసింగ్ సూచనలు

03

## చందానగర్‌లో కాల్పుల కలకలం
### నగల దుకాణంలో దుండగుల అఘాయిత్యం
ఖజానా జ్యువెలరీలో దొంగల దోపిడీ

03

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | ↗ 80,235.59 |
| నిఫ్టీ | ↗ 24,487.40 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.8 | 144 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.8 | 144 |
| రిటైల్ గుడ్డు ధర | 5.09 | 152.64 |



# వీధి కుక్కలే దేశ సమస్యా?
## రూ.15 వేల కోట్లతో 3వేల షెల్టర్లు కట్టే సత్తా ఢిల్లీ సర్కారుకు ఉందా?
- పరిశీలించండి సారూ.. సుప్రీం తీర్పుపై ప్రముఖులు
- ఇది క్రూరమైన, అవివేకమైన చర్య అంటూ వ్యతిరేకించిన రాహుల్ గాంధీ
- తీవ్రంగా స్పందించిన బాలీవుడ్ ప్రముఖులు జాహ్నవి, జాన్ అబ్రహాం, అడవిశేష్, వరుణ్ దావన్

02





# మహేష్ దూకుడు

## తగ్గేదెలే అంటున్న పీసీసీ చీఫ్

ఓ వైపు పార్టీ కార్యక్రమాలు.. మరోవైపు సర్కారు పథకాల ప్రచారం

హైకమాండ్ ఆశీస్సులతో దూసుకుపోతున్న లీడర్

తొలివిడత పాదయాత్ర సక్సెస్

24 నుండి రెండవ విడతకు రెడీ

పాదయాత్రపై రాహుల్, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ అభినందనలు

క్యాడర్ లో ఉత్సాహం నింపేలా సాగుతున్న కార్యక్రమాలు

మంత్రులతో ముఖాముఖి సూపర్ హిట్.. ప్రతిరోజు గాంధీభవన్ కు ప్రజాప్రతినిధులు

(కంది రామచంద్రారెడ్డి)

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తన విలక్షణ పనితీరుతో అటు ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ.. స్టేట్ పాలిటిక్స్ లో తగ్గేదెలే అని దూసుకుపోతున్నాడు. గతంలో ఏ పీసీసీ చీఫ్ చేయనన్ని విలక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీలో పాదయాత్రకు అనుమతి రావాలంటే.. ఎంతో కష్టమైన ప్రయాస. గతంలో వైఎస్సార్, సీఎం రేవంత్, భట్టి విక్రమార్క లాంటి నేతలు పాదయాత్రలు చేసినా.. హైకమాండ్ అనుమతి కోసం ఎంతో ముందస్తు ప్లాన్, ఎన్నో నెలలు.. సంవత్సరాల ప్లానింగ్ ఉండేది. కానీ మహేష్ గౌడ్ పీసీసీ చీఫ్ గా జనహిత పాదయాత్ర చేపట్టి సంచలనమే అయ్యాడు. మొదట ఇది ఇన్ ఛార్జి మీనాక్షి పాదయాత్రగా ప్రచారం జరిగినా, పీసీసీ చీఫ్ మహేష్ జనహిత పాదయాత్రగా తేలింది. ఇపుడు రెండోవిడత పాదయాత్రకు పీసీసీ చీఫ్ రెడీ అయ్యారు. హైకమాండ్ మన్ననలు విశ్వాసం ఎంతో ఉంటే గానీ కాంగ్రెస్ లాంటి పార్టీలో ఇలాంటి అవకాశం దక్కదు. పీసీసీ చీఫ్ గా మహేష్ పనితీరుకు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై ఎఐసిసికి, రాహుల్ గాంధీకి ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు.**

### మాస్టర్ మైండ్

మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ చాణక్యుడు. బీసీ కుల గణన, బీసీ రిజర్వేషన్లతో కాంగ్రెస్ పార్టీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల కోసం పోరాడే పార్టీగా, నిలబడే పార్టీగా నిలపగా.. దీనిని పార్టీకి అనుకూలంగా మలచడంలో మహేష్ కుమార్ గౌడ్ మంత్రాంగమే కీలకమైంది. పరిగి నుండి ఖానాపూర్ దాకా సాగిన మహేష్ గౌడ్ తొలివిడత పాదయాత్రకు మంచి రెస్పాన్స్ లభించింది. పాదయాత్ర అంటే ఎంతో వ్యయప్రయాసలతో కూడకున్నది. అధికారపార్టీగా పాదయాత్ర నిర్వహించాలంటే ఎంతో ధైర్యం కావాలి. కానీ పీసీసీ చీఫ్ గా మహేష్ డేరింగ్ అండ్ డాషింగ్ గా దూసుకుపోతూ ప్రభుత్వ విజయాలను ప్రచారం చేస్తూ.. ప్రత్యర్థిపార్టీలపై విరుచుకుపడుతున్నాడు. తన ప్రసంగాల్లో పదును, సూటిగా సంధించే వాగ్బాణాలకు క్యాడర్ చప్పట్లతో హర్షామోదం తెలుపుతున్నారు.

### ఏ కార్యక్రమం చేపట్టినా హిట్టే,...

మహేష్ కుమార్ గౌడ్ ఏ కార్యక్రమం చేపట్టినా హిట్టే అన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో ఉంది. స్వయంకృషితో, పట్టుదలతో, పార్టీ పట్ల అంకితభావంతో, దార్శనికతతో మహేష్ గౌడ్ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం సంచలనం. సాధారణంగా అధికారంలోకి వచ్చాక మంత్రులు గాంధీభవన్ వైపు చూడరు. కానీ అందరినీ గాందీభవన్ కు రప్పించిన ఘనత మహేష్ దే. ఇపుడు ప్రతీరోజూ ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ ఛైర్మన్ లను రప్పిస్తూ షెడ్యూల్ ఖరారుచేయడంతో గాంధీభవన్ కళకళలాడుతోంది. ప్రజలు కూడా తమ సమస్యలు తీరుతాయన్న భరోసాతో గాంధీభవన్ కు వస్తున్నారు. సంస్థాగత నిర్మాణం కోసం పలు సమావేశాలు జరగ్గా, త్వరలో ఆ కమిటీలు కూడా పూర్తయితే ఇక పార్టీకి ఫుల్ జోష్ పక్కా. బీసీ రిజర్వేషన్లు, కులగణన అంశంలో పీసీసీ చీఫ్ ముందడుగు, పార్టీ నేతలతో, బీసీ సంఘాలతో చేసిన సమన్వయం సర్కారుకు మంచి పేరు తెచ్చింది. బీసీ రిజర్వేషన్ల అంశంలో ఢిల్లీ ధర్నా కూడా సూపర్ హిట్ కాగా, బిజెపినే బీసీ రిజర్వేషన్ల పాలిట విలన్ అంటూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. త్వరలో జరగనున్న జూబ్లిహిల్స్ బైపోల్ పై ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

## ఇదీ సెకండ్ ఫేజ్ షెడ్యూల్

ఈనెల 24 నుంచి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభం కానుండగా, 24వ తేదీ చొప్పదండి నియోజక వర్గంలో సాయంత్రం 5 గంటలకు జనహిత పాదయాత్ర జరగనుంది. 25వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రమదానం, 10.30 గంటల నుంచి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమ్మేళనం జరగనుంది. 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గంలో జనహిత పాదయాత్ర జరగనుండగా, 26వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రమదానం, 10.30 గంటలకు వరంగల్ జిల్లా కార్యకర్తల సమ్మేళనం, 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరగనుంది. తొలివిడత నాలుగు జిల్లాల్లో పాదయాత్ర జరగ్గా, రెండో విడత మూడు జిల్లాల్లో పాదయాత్ర సాగనుంది.

# వీధి కుక్కలే దేశ సమస్యా?

## రూ.15 వేల కోట్లతో 3వేల షెల్టర్లు కట్టే సత్తా ఢిల్లీ సర్కారుకు ఉందా?



- పరిశీలించండి సారూ.. సుప్రీం తీర్పుపై ప్రముఖులు
- ఇది క్రూరమైన, అవివేకమైన చర్య అంటూ వ్యతిరేకించిన రాహుల్ గాంధీ
- తీవ్రంగా స్పందించిన బాలీవుడ్ ప్రముఖులు జాహ్నవి, జాన్ అబ్రహాం, అడవిశేష్, వరుణ్ దావన్

(మహా నెట్ వర్క్)

ఢిల్లీ, ఎన్సీఆర్‌లలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జంతు హక్కుల కార్యకర్తలు, జంతు ప్రేమికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇండియా గేట్ వద్ద ఆందోళనకు దిగిన పలువురిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ తీర్పు దిగ్భ్రాంతికరమని, జంతు జనన నియంత్రణ చట్టానికి విరుద్ధమని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్స్ , పెటా వంటి సంస్థలు ఆరోపించాయి. ఈ తీర్పుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. రోజు రోజుకు మనం సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లుగా ఉందన్నారు. మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదని.. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదని అన్నారు. "ఈ మూగజీవాలు తొలగించాల్సిన సమస్యలు కావు. అన్నింటినీ ఒకేసారి తరలించడం క్రూరమైన, అవివేకమైన చర్య. కుక్కల నుంచి ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్థానికంగా షెల్టర్ల ఏర్పాటు, స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### సీజేఐకి లేఖ రాసిన సినీ ప్రముఖులు

వీధి కుక్కల అంశంలో 'సుప్రీం' ఇచ్చిన ఆదేశాలను పునఃపరిశీలించాలని అభ్యర్థిస్తూ సినీ నటుడు అడివి శేష్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో దిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ సైతం ఈ విషయాన్ని లేవనెత్తారు. ఈ తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. "ఢిల్లీలో 3 లక్షల వీధి కుక్కలున్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా?" అని ప్రశ్నించారు. ప్రముఖ బాలీవుడ్ నటులు జాన్ అబ్రహం , వరుణ్ ధావన్ , జాన్వీ కపూర్ సైతం కుక్కలపై కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పునః పరిశీలించాలని కోరుతూ.. బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం అత్యున్నత న్యాయస్థానానికి లేఖ రాశారు. అందులో వీధుల్లో ఉండే కుక్కలన్నీ ప్రజలకు హాని తలపెట్టవని..చాలా మంది ప్రజలు వాటిని ఎంతో ప్రేమగా చూసుకుంటారని అన్నారు. కుక్కలు కూడా ఎంతో విశ్వాసంగా ఉంటాయని తెలిపారు. కుక్కలను పూర్తిగా లేకుండా చేయడానికి బదులుగా వాటికి స్టెరిలైజేషన్, టీకాలు వేయించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. నటులు వరుణ్ ధావన్, జాన్వీ కపూర్, వీర్ దాస్ సైతం కోర్టు తీర్పుపై స్పందిస్తూ..ఇది కుక్కలకు మరణశిక్షతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు.


## ఖమ్మంకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పుడు

# నల్గొండకు ఉంటే తప్పేంటి..?

### నాకు హామీ ఇచ్చినపుడు మా అన్న ఉన్న విషయం తెలియదా?

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అల్టిమేటం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర కాంగ్రెస్ లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం రోజురోజుకూ సంచలనంగా మారుతోంది. తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పి.. ఇవ్వకపోవటం పైన రాజగోపాల్ రెడ్డి ప్రతీ సందర్భంలోనూ పార్టీని, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సీఎం రేవంత్ తానే పదేళ్లుగా సీఎంగా ఉంటానని చేసిన వ్యాఖ్యలు.. మీడియా పైన స్పందించిన తీరును రాజగోపాల్ రెడ్డి కౌంటర్ చేసారు. ఇక.. ఇప్పుడు ఖమ్మంలో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చి.. నల్గొండకు ఇవ్వటానికి అడ్డు ఏంటని నిలదీసారు. తనకు హామీ ఇచ్చిన సమయంలో తన అన్న గురించి తెలియదా అంటూ రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి రాకపోవడంపై మరో సారి కీలక వ్యాఖ్యలు చేసారు. మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజ్ గోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టేనని చెప్పకొచ్చారు. తనకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా ఇప్పుడు కూడా చెప్తున్నానని పేర్కొన్నారు. మంత్రి పదవిపైన మాట ఇచ్చారని, ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ, అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారని, అసలు సమీకరణాలు ఎందుకు కుదరటం లేదని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎవరు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. తనను కాంగ్రెస్ లోకి తీసుకున్నప్పుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన సోదరుడని పార్టీ నేలకూ, అధిష్టానానికి తెలియదా అంటూ నిలదీసారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని అంటూ ప్రశ్నించారు. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉందని వ్యాఖ్యానించారు. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారని గుర్తు చేసారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా అంటూ రాజగోపాల్ రెడ్డి కొత్త చర్చకు తెర లేపారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్నానని.. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.





## నిజం సింహం లాంటిది..

### కేటీఆర్ లీగల్ నోటీసులపై బండి సంజయ్ రియాక్షన్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. నిజం సింహం లాంటిది, తనను తానే రక్షించుకుంటుందని సంజయ్ వాఖ్యనించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా జీవితాలు నాశనం చేసిన నేరస్థులు తప్పించుకోలేరని సంజయ్ చెప్పారు. నిజం.. ఎప్పటికైనా గెలిచి తీరుతుందన్నారు. కాగా ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైన బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. బండి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన కేటీఆర్.. ఆయనకు మంళవారం నోటీసులు పంపించారు.

# బీజేపీలో చేరుతున్నారా ఇవి తెలుసుకోండి

### టికెట్ గ్యారెంటీ ఉండదు.. మీ అనుచరులకు పదవులు దక్కవు.. కొత్తగా పార్టీలో చేరేవారికి రాజాసింగ్ సూచనలు

**హైదరాబాద్, మహా :** ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరే నేతలకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక సూచనలు చేశారు. పార్టీలో చేరే ముందు అన్ని విషయాలపై చర్చించాలని, పదవులు, టికెట్ల గురించి ఆశించవద్దని సూచించారు. విజయశాంతి వంటి నేతలు పార్టీని ఎందుకు వీడారో తెలుసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ బీజేపీలో కొందరు పెత్తనం చేయడం వల్లే పార్టీ నష్టపోతోందని రాజాసింగ్ విమర్శించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్టీ రాష్ట్ర నాయకత్వంపై అసహనంతో ఆయన రాజీనామా చేయగా.. హైకమాండ్ ఆమోదించింది. ప్రస్తుతం ఆయన ఏ పార్టీలోనూ చేరలేదు. ఇక ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాషాయం కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు సైతం బీజేపీలో చేరేందుకు రెడీగా ఉన్నారని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లీకులిచ్చారు. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరేవారికి ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక సూచనలు చేశారు. బీజేపీలో చేరే ముందు కొన్ని విషయాలు గుర్తుపెట్టుకోవాలని, పూర్తి స్థాయి చర్చలు జరిపి రావాలని ఆయన సూచించారు. పార్టీలో తమకు అనుకూలంగా ఏమీ జరగదని, కార్యకర్తలకు పదవులు ఇప్పించలేరని, టికెట్ గ్యారెంటీ ఉండదని రాజాసింగ్ అన్నారు. తాను 11 ఏళ్లుగా పార్టీలో అణచివేతను ఎదుర్కొంటున్నానని, తమ నియోజకవర్గంలో తనకు తెలియకుండానే ఇతరులకు పదవులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీలో చేరినప్పుడు ముందు వరుసలో ఉన్నప్పటికీ.. తరువాత చివరి స్థానానికి చేరుకుంటారని, ఎన్నికల్లో టికెట్ వస్తుందనే గ్యారెంటీ ఉండదని చెప్పారు. విజయశాంతి, జితేందర్ రెడ్డి, నాగం జనార్ధన్ రెడ్డి వంటి నేతలు ఎందుకు పార్టీని వీడి వెళ్లారో వారితో మాట్లాడి తెలుసుకోవాలని రాజాసింగ్ సలహా ఇచ్చారు. తెలంగాణ బీజేపీలో కొందరు తమదే పెత్తనం అని భావించడం వల్లనే పార్టీ సర్వనాశనం అవుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాక్షసులు నాశనమైన తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తల ఆశీస్సులతో ముఖ్యమంత్రి కూడా బీజేపీ నుంచే వస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాజాసింగ్ వ్యాఖ్యలు తెలంగాణ బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. గువ్వల బాలరాజు బీజేపీలో చేరిన నేపథ్యంలో రాజాసింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీలో ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతలకు తగిన గౌరవం దక్కడం లేదని రాజాసింగ్ ఆరోపిస్తున్నట్లుగా ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## ఏపీలో పదవుల జాతర

- సెకండ్ ఫేజ్ లో 31 కార్పోరేషన్లకు ఛైర్మన్లు
- తొలివిడత 62 మందికి పదవులు

**మహా:** ఏపీ ప్రభుత్వం రెండో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఒకేసారి 31 కార్పోరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. 31 నామినేటెడ్ పదవుల్లో టీడీపీకి 26 దక్కాయి. ఈ జాబితాలో వివిధ కార్పొరేషన్లు, కమిషన్లకు ఛైర్మన్లు, సభ్యుల నియామకాలు ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే 62 నామినేటెడ్ పదవులతో కూడిన ఫస్ట్ లిస్టును రిలీజ్ చేయగా, ఇపుడు మరో 31మందికి దక్కాయి. తెలంగాణలో రెండేళ్ళయినా పదవుల భర్తీ జరగడం లేదన్న నారాజ్ నాయకుల్లో ఉంది.

# ఎన్టీఆర్‌ను ట్రోలేస్తున్నారు

## టార్గెట్ చేసిన టీడీపీ ఫ్యాన్స్

**వార్2 రిలీజ్ ముందు ఫ్యాన్ వార్**

**నన్నెవరూ ఆపలేరంటూ వార్నింగ్ ఇచ్చిన ఎన్టీఆర్**

**జై ఎన్టీఆర్.. జై హరి కృష్ణ అంటూ ప్రసంగం**

**ఎన్టీఆర్ కు మద్దతుగా వైసీపీ ఫ్యాన్స్**

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి చిన్నవిషయాన్ని భూతద్దంలో చూపిస్తూ ఎన్టీఆర్ పై నెగెటివిటీని పెంచేస్తున్నారు. ఇపుడు వార్ 2 ప్రిరిలీజ్ ఈవెంట్ లో ఎన్టీఆర్ ప్రసంగం దద్దరిల్లగా, దీనికి పాలిటిక్స్ కు లింక్ చేసి ఎప్పటికైనా పాలిటిక్స్ లోకి రావడం పక్కా అంటూ అభిమానులు కాలరెగరేసి ఆనందపడ్డారు. అయితే రామోజీ నుండి రాజమౌళి దాకా అందరి పేర్లు పలికిన ఎన్టీఆర్ తన ప్రసంగంలో ఎక్కడా ఆరంభంలో సహాయం చేసిన బాలయ్య పేరు గానీ, చంద్రబాబు పేరు గానీ ప్రస్తావించలేదంటూ ట్రోలింగ్ మొదలెట్టిన టీడీపీ అభిమానులు, కొందరు ట్రోల్ గ్యాంగ్ ఎన్టీఆర్ టార్గెట్ గా పిచ్చిపోస్టులు పెడుతున్నారు. ఇపుడు ఆంధ్రప్రదేశ్ లో లోకేష్ హవా నడుస్తుండగా, రాజకీయంగానూ లోకేష్ తిరుగులేని పట్టుబిగించాడు. రెడ్ బుక్ తో బడా నేతలు అనుకున్న వారినీ గడగడలాడిస్తున్నారు. ఈ ప్రభావం ఎన్టీఆర్ ప్రసంగంపై స్పష్టంగా ఉందని, నన్నెవరూ ఆపలేరంటూ ఎన్నడూ లేని రీతిలో ఎన్టీఆర్ చేసిన ప్రసంగం అతనిపై ఒత్తిడిని సూచిస్తున్నదని అంటున్నారు. టిడిపి ఫ్యాన్స్ పాతికేళ్ళక్రితం ఇపుడు అంటూ వీడియోలను పోల్చి



ట్రెండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో జూనియర్ ఎన్టీఆర్‌ను టార్గెట్ చేయడం ఇపుడు కొత్తేమీ కాదు. దేవర సినిమాకు కూడా నెగిటివ్ పబ్లిసిటీ చేశారు. ఏపీ రాజకీయాల్లో కొన్ని పరిణామాలు జూనియర్ ఎన్టీఆర్‌కు శాపంగా మారాయి. ఆ కారణాలతోనే పొలిటికల్ ట్రోలింగ్ కామన్ అయిపోయింది. పొలిటికల్ ఫ్యామిలీ కావడం, 2009లోనే చంద్రబాబును గెలిపించండి అంటూ వైఎస్ఆర్ పైనే తొడకొట్టిన ఎన్టీఆర్.. తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల్లో సినిమాకే పరిమితమయ్యారు. అయితే ఎన్టీఆర్ భావావేశం చూస్తుంటే ఎంతోకాలం ఆగేలా లేదన్న చర్చా జరుగుతోంది. వార్ 2 సినిమాకు మొదటి నుండీ తెలుగులో పెద్దగా హైప్ లేకపోగా, నాగవంశీ టేకోవర్ చేయడం.. హృతిక్ రోషన్ రావడం, త్రివిక్రమ్ కూడా మద్దతుగా నిలవడంతో బజ్ ఏర్పడింది. అయితే చాలాకాలంగా ప్రజల ముందుకు, అభిమానుల ముందుకు రాని ఎన్టీఆర్.. ఇపుడు పెద్దఫంక్షన్ చేయడంతో చెప్పాల్సినవీ చెప్పకూడనివీ చెప్పేశారు. మరోవైపు తమ అభిమాన స్టార్ ఎన్టీఆర్ సినిమాపై నెగటివ్ పబ్లిసిటీ తెచ్చేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. ఏపీలో రెండు పొలిటికల్ పార్టీలు కార్యకర్తలు ఈ ట్రోల్ చేస్తున్నారని చెబుతున్నారు. ఏ సంఘటన అయినా ఏపీ రాజకీయాలకు, ఎన్టీఆర్ కు లింక్ చేసి ట్రోల్ చేయడం కామన్ గా మారింది. తారకరత్న మృతి సమయంలో , ఆర్ఆర్ఆర్ ఆస్కార్ వేడుకలప్పుడు , ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలసమయంలో, భువనేశ్వరిని అసెంబ్లీలో అవమానించినపుడు, దేవర సినిమా రిలీజ్ మయంలో ఎన్టీఆర్ ను విపరీతంగా ట్రోల్ చేశారు. ఎన్టీఆర్ ఏం చేసినా ట్రోల్ చేయడానికి గ్యాంగ్ లకు గ్యాంగ్ లు పనిచేస్తున్నాయి. ఎన్టీఆర్ తన మానాన తాను సినిమాలు చేసుకుంటూ జాతీయస్థాయిలో రాణిస్తుంటే.. రాజకీయాల్లో ఉన్న వారు తమ హీరోను ట్రోల్ చేసి నష్టం కలిగించడం సరికాదని పలువురు అభిమానులు అంటున్నారు. ట్రోల్ ను తగ్గించేందుకు, నెగెటివిటీ తగ్గించి పాజిటివిటీని పెంచేందుకు నాగవంశీ ట్రై చేస్తున్నారు. అయితే.. వార్ 2 ఇపుడు మొదలైనా అసలు వార్ ఎపుడో మొదలైందని విశ్లేషకులు అంటున్నారు.

# చందానగర్‌లో కాల్పుల కలకలం

## నగల దుకాణంలలో దుండగుల అఘాయిత్యం

**ఖజానా జ్యువెలరీలో దొంగల దోపిడీ**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ చందానగర్ లో మంగళవారం ఉదయం కాల్పులు కలకలం రేపాయి. ఖజానా జ్యువెలరీ దుకాణంలో దుండగులు దోపిడీకి ప్రయత్నించారు. ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. తుపాకీ కాల్పులతోనే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో డిప్యూటీ మేనేజర్ కాలికి గాయమైంది. ఉదయం 10.40 గంటలకు దుకాణంలో చోరీకి దుండగులు తెగబడ్డారు. మాస్కులు ధరించి వచ్చిన వారు, వచ్చీ రావడంతోనే బెదిరింపులకు దిగారు. గన్‌తో బెదిరించి లాకర్ కీ ఇవ్వాలని బెదిరించారు. తర్వాత అసిస్టెంట్ మేనేజర్‌ను లాకర్ కీ ఇవ్వాలని గన్ పెట్టి బెదిరించారు. తాను ఇవ్వనని చెప్పడంతో అతనిపై కాల్పులు జరిపారు. తర్వాత బంగారు ఆభరణాలున్న స్టాల్స్ అద్దాలు పగులగొట్టారు. ఈ క్రమంలో ప్రతిఘటించిన దుకాణం సిబ్బందిపై దాడి చేసి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్ గాయపడ్డారు. దుండగులు కాల్పులు జరపడంతో ఆయన ఎడమ కాలిలో బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో చందానగర్ పీఆర్కే ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న సతీష్ కుమార్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దొంగలు తొలుత ఖజానా జువెలర్స్



గేట్ వద్ద ఉన్న సిబ్బందిని గాయపరిచి లోపలకు ప్రవేశించారు. ఆ తర్వాత షాపు లోపల ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. లాకర్ కీ ఇవ్వడానికి నిరాకరించిన కారణంగా అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. షాపు లోపల నగలు ఉన్న స్టాల్స్ నూ పగుల గొట్టారు. దొంగల ముఠాలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్నట్టు సమాచారం. దొంగలు దొరికిన కాడికి దోచుకుని పరారయ్యారు. ఎక్కువగా వెండి వస్తువులు చోరీకి గురైనట్టు సమాచారం. దొంగలు జహీరాబాద్ వైపు పారిపోగా... జిల్లా సరిహద్దు పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. పరారైన దుండగుల కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో చందానగర్ లో భయానక వాతావరణం నెలకొంది.

# ఆదాయ వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి

## ఆర్థిక వనరులను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలి: భట్టి

**కమర్షియల్ ట్యాక్స్, మైనింగ్ శాఖల్లో ఆదాయ ఆర్జనలో గణనీయమైన వృద్ధి**

**అధికారులకు ఉప ముఖ్యమంత్రి అభినందనలు**

**రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం**



**హైదరాబాద్, మహా:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజల ఆరోగ్యానికి ,పర్యావరణ రక్షణకు విఘాతం కలిగించే కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా కఠినమైన క్యాలెండర్ రూపొందించి అమలు చేయాలని సూచించారు. కమర్షియల్ టాక్స్, మైనింగ్ శాఖల్లో ఆదాయ ఆర్జనలో గణనీయమైన వృద్ధి సాధించిన అధికారులను అభినందించిన డిప్యూటీ సీఎం. రాష్ట్ర ఆదాయాన్ని మరింత పెంచేందుకు వినూత్న పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు ప్రతిపాదనల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి, గృహ యజమానులకు తక్షణ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వ సిబ్బందికి

# మూడు రోజుల సెలవులు రద్దు

## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

- **ఆకస్మిక వరదలు వస్తే ఆదుకునేందుకు సన్నద్ధంగా ఉండాలని హైడ్రాకు ఆదేశం**

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్న ఆయన హైదరాబాద్ లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, వరదల ప్రభావంపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదిశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, స్కూల్స్, కాలేజీలు, ఐటీ సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, తుమ్మల, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ముందస్తు చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఉమ్మడి వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు భారీ వర్ష సూచనలు ఉన్నాయి. పలు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలను జారీచేసింది. బుధవారం కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. బుధవారం యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు ఉన్నాయని పేర్కొంది. ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 9 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

**ఎకో టూరిజంపై సమీక్ష**

అంతకు ముందు రేవంత్ రెడ్డి అటవీశాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, అధికారులు హాజరయ్యారు. ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జంతువుల దాడి బాధితులకు వేగంగా పరిహారం అందించాలని, అధికారుల ప్రమోషన్లు, అవార్డులకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలని సూచించారు.

# పిస్తాహౌజ్ లకు షాక్..

## 25 బ్రాంచీలలో.. నో ఫుడ్ సేఫ్టీ

**వంట గదిలో ఎలుకలు, బొద్దింకలు, ఈగలు**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లోని పలు పిస్తా హౌస్ రెస్టారెంట్ల లో ఫుడ్ సేఫ్టీ అధికారుల 2025 ఆగస్టు 12వ తేదీన తనిఖీలు చేపట్టారు. మొత్తం 25 పిస్తా హౌస్ రెస్టారెంట్లలో తనిఖీలు చేసి అధికారులు 23 చోట్ల శాంపిల్స్ సేకరించారు. తనిఖీల అనంతరం నిబంధనలు పాటించట్లేదని తేల్చిన ఫుడ్ సేఫ్టీ అధికారులు తేల్చారు. కిచెన్ పరిసరాలు చాలా అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వంట గదిలో ఎలుకలు, బొద్దింకలు, ఈగలు తిరుగుతున్నట్లు నిర్ధారించారు. నాన్‌వెజ్ వంటకాల్లో నాణ్యతలేని, నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు తేలింది. ఆహారాన్ని నిల్వ చేసే ఫ్రిజ్‌లు తుప్పు పట్టి ఉండటంతో పాటు, వాటిలో నిల్వ చేసిన నాన్‌వెజ్ పదార్థాలను సరిగా భద్రపరచడం లేదని అధికారులు పేర్కొన్నారు. కొన్ని బ్రాంచ్‌లలో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లకు సంబంధించిన గడువు ముగిసినట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీలలో మొత్తం 25 పిస్తా హౌస్ బ్రాంచ్‌లలో అధికారులు తనిఖీలు చేసి, వాటిలో 23 చోట్ల ఆహార నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు



పంపించారు. ఈ లోపాలపై పిస్తా హౌస్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

# త్వరలో ఉద్యోగాల భర్తీ ప్రకటన!

- **కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ఉద్యోగాలు సాధ్యం**
- **టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ గత పాపాలు రాష్ట్రంలోని నిరుద్యోగులకు శాపంగా మారాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ విమర్శించారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిరుద్యోగులకు పెద్దన్నగా సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాల భర్తీ కోసం ఐఏఎస్‌లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఉద్యోగాల భర్తీ కోసం పూర్తి స్థాయిలో నిమగ్నమైందన్నారు. అశోక్ అనే రాజకీయ శిఖండి నిరుద్యోగులను అడ్డుపెట్టుకుని తన



కోర్సులు అమ్ముకుని డబ్బు సంపాదనకు రుచి మరిగి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఏజెంట్‌గా మరి నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య ఆగదం సృష్టిస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ఉద్యోగాలు సాధ్యమని పేర్కొన్నారు. నిరుద్యోగులతో రాజకీయాలు చేసి శిఖండులను ఎరివేద్దామని పిలుపునిచ్చారు. ఐఏఎస్‌ల కమిటీ వేసింది ఉద్యోగాల భర్తీ కోసమని, త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రకటన ఉండబోతుందని చెప్పారు.



OPINION ఒపీనియన్

# అనంత జన వాహిని సాక్షిగా...
# జగనోదయం...!



"ఎవరి హృదయం పేదల అభ్యున్నతి కోసం పరితపించునో అట్టి వానినే నేను మహాత్ముడందును"అంటారు ఓ ప్రముఖ తత్వవేత్త. స్వాతంత్ర భారతంలో దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా రాజకీయాల్లో ఎందరో మహా నాయకులు పేదరిక నిర్మూలనకై తమ వంతుగా బాధ్యత వహిస్తూ,పెను సవాళ్లను అధిగమిస్తూ, దార్శనికతతో కూడిన ఎన్నో వినూత్న కార్యక్రమాలతో, పేదల బ్రతుకు చిత్రాన్ని మార్చే ప్రయత్నమే చేశారు. అలాంటి వాళ్లు మరణించాక కూడా జనం గుండెల్లో సజీవమై నిలిచే ఉంటారు. కార్పొరేట్ విద్య,వైద్యం వంటివి కేవలం ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా,సాంస్కృతికంగా బలంగా ఉన్న కొన్ని కుటుంబాలకే అందుతున్నాయనీ,అవి ప్రజలందరికీ సమానంగా అందాలనీ ఆలోచించి పేద ప్రజల కుటుంబాలకు ఇంజనీరింగ్, మెడిసిన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి గొప్ప గొప్ప చదువులను,కార్పొరేట్ వైద్యాన్ని అందించిన మహా నాయకులు,దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి. వైయస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్,ఆరోగ్యశ్రీ, రైతు సంక్షేమం,జల యజ్ఞం వంటి పథకాలు నేటికీ మన దేశ రాజకీయాల్లో, ఎన్నో రాష్ట్రాల ప్రభుత్వ పథకాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ కొన్ని లక్షల పేద కుటుంబాల ప్రజల జీవన రూపురేఖల్ని మార్చాయి. చదువుల వెలుగుల్ని నింపాయి.ఆగే గుండెల్ని సైతం బ్రతికించాయి. రైతుల్ని ఈ దేశానికి రాజుని చేశాయి.

వైయస్సార్ ఆకస్మిక దుర్మరణం తర్వాత అనుకోని ఎన్నో అనూహ్య రాజకీయ సంఘటనల నేపథ్యంలో వారి కుమారుడైన జగన్ సొంత పార్టీ పెట్టి దేశ రాజకీయాల్లోనే సంచలనం సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత 11 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజాక్షేత్రంలో తండ్రికి తగ్గ తనయుడిగా తనదైన బాటలో ఓ దీటైన జననాయకుడిగా ప్రభంజనం సృష్టిస్తూనే ఉన్నారు. ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీలతో పొత్తులు పెట్టుకోకుండా ఒక్కడే కోట్ల జనం గొంతుకగా నడుస్తూనే,తన పార్టీని నడిపిస్తూనే ముందుకు కొనసాగుతున్నారు.ఓసారి ఎంపీ ఎలక్షన్స్ ఫలితాల్లో జగన్ కు వచ్చిన మెజారిటీ దేశాన్నే ఆకర్షించింది.ఇప్పటికీ ప్రజల్లో ఆయనకున్న క్రేజ్ కిలోమీటర్ల పాటు జనం బారులు తీరిన తీరే తెలుపుతుంది.2014 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీ 67 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది అప్పట్లో ఓ ప్రముఖ వార్తై నిలిచింది. అనుభవజ్ఞులైన అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కి ధీటుగానే జగన్ రాజకీయ వ్యూహాలతో ప్రజాపక్షమై ప్రతిపక్ష నేతగా తనదైన మార్క్ ను సృష్టించుకోవడం జరిగింది. తన తండ్రి హావభావాలతో,మాట శైలితో పాటు మడమ తిప్పని నైజం, వెనకడుగు వేయని ధైర్యంతో జగన్ చేసిన సుదీర్ఘ పాదయాత్ర విపరీతమైన ప్రజాభిమానాన్ని చూరగొన్నది. "రావాలి జగన్ కావాలి జగన్" అనే స్లోగన్ ఆంధ్ర ప్రదేశ్ ముఖచిత్రమై ప్రతిధ్వనించింది. దాని ఫలితంగానే 2019 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 151 స్థానాల్లో వైసిపి అభ్యర్థులు ఏ ఎగ్జిట్ పోల్ ఊహకు అందనంత స్థాయిలో విజయ ఢంకా మోగించారు. దేశం మొత్తం మోడీ హవా నడుస్తున్న ఆ తరుణంలో ఆంధ్రప్రదేశ్ లో జగన్ పట్టాభిషేకం దేశ రాజకీయాల్లోనే అపూర్వ ఘటనగా నిలిచిపోయింది. ముఖ్యమంత్రిగా జగన్ తీసుకున్న కొన్ని పాలనాపరమైన నిర్ణయాలు విమర్శల పాలైనప్పటికీ, కొన్ని సంక్షేమ పథకాలు మాత్రం పేద ప్రజల బతుకులు మార్చడంలో నవరత్నాలు గా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయన్నది నిజం. ముఖ్యంగా విద్యా ,వైద్య, వ్యవసాయ రంగాల్లో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు ఐక్యరాజ్యసమితిని సైతం ప్రభావితం చేశాయి. నాడు నేడు పేరుతో 45000 ప్రభుత్వ పాఠశాలలో వచ్చిన వైట్ బోర్డులు,డిజిటల్ బోర్డులు, శుభ్రమైనటువంటి టాయిలెట్ సదుపాయాలు, మంచి లైటింగ్,కొత్త తరగతుల నిర్మాణం ,ప్లేగ్రౌండ్, తాగునీటి వసతి వంటివి ఎన్నో ఆయనలోని దార్శనికతపు ఆలోచనలకు అద్దం పట్టాయి. లక్షల మంది పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యనందించాయి. జగన్ నవరత్నాలు నవ్యాంధ్రను బాగానే ప్రకాశించేలా చేశాయి. "మానవత్వం నా మతం.మాట తప్పకపోవడం నా కులం. మేనిఫెస్టో నాకు భగవద్గీత ఖురాన్ బైబిల్ అంటూ జగన్ మాటల జోరు సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అయింది. "వై నాట్ 175"అన్న నినాదంతో 2024 అసెంబ్లీ ఎన్నికలకు జగన్ శంఖారావం పూరించారు.

జగన్ ప్రభుత్వంలో కొంతమంది మంత్రులు మాట్లాడిన మాటల తీరు, కొన్ని సందర్భాల్లో బయటపడిన రాజకీయ విద్వేషపు పనులు,చంద్రబాబు అరెస్టు,పవన్ కళ్యాణ్ జనసేనతో టిడిపి,భాజపా కలిసి మహా కూటమిగా ఏర్పడడంతో పాటు జగన్ కుటుంబ అంతర్గత వ్యవహారాలు రాజకీయ క్షేత్రంలో దుమారం లేపడం వంటివి ఎన్నో రాజకీయ కారణాల వల్ల ఎవ్వరూ ఊహించని విధంగా 2024 ఎన్నికల ఫలితాల్లో జగన్ పార్టీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. ఇక అప్పటి నుంచి జగన్ పై,పార్టీ నాయకులపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తుంది. రాజ్యాంగబద్ధంగా,సీట్ల పరంగా జగన్ పార్టీకి ప్రతిపక్ష హోదా రానప్పటికీ నేటి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వానికి ప్రజల పరంగా జగనే ప్రతిపక్ష నేత. చంద్రబాబు నాయకత్వంలోని మహాకూటమి ప్రభుత్వ పాలన ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంలో రాష్ట్రంలో ఓ పక్క కూటమి ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తుండగానే,మరో పక్క సూపర్ సిక్స్ అంతా మాయని, ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు మళ్ళీ సక్సెస్ అయ్యాడంటూ వ్యంగ్యాస్త్రాలతో జగన్ బలమైన ప్రతిపక్ష నేతగా, జన సైన్యాన్ని వెంటేసుకొని ప్రజల దృష్టిని,మీడియా దృష్టిని ఆకర్షిస్తూ,ప్రజా సమస్యలతో ప్రజల పక్షాన ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. 2029 లో నేను వచ్చాక లెక్కలన్నీ సరి చేస్తానని జగన్ తరచుగా వ్యాఖ్యానిస్తుండడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశమైంది.

దశాబ్దంన్నరకు పైగా ఒక్కడే తనదైన వ్యూహాలతో, రాజకీయ నాటకీయ చదరంగపు అడుగులతో జగన్ చేస్తున్న ప్రయాణం ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. జగన్ కు సంబంధించిన అక్రమాస్తుల కేసులు, జగన్ ప్రభుత్వ పాలనా విధానాల కు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, జగన్ నడవడిక,నాయకత్వ పోకడలపై సమాజంలో మిశ్రమ స్పందనలు ఉన్నప్పటికీ,నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో అన్ని పార్టీలు ఒక సైడు... జగన్ ఒక్కడు ఒక సైడ్ గా వుంటూ ప్రజా సమస్యల పై ప్రభుత్వాన్ని గట్టిగానే ప్రశ్నిస్తున్నాడు. ఆయన వస్తున్నాడని తెలిస్తే కొన్ని కిలోమీటర్ల వరకు జనం బారులు తీరుతుండడం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టుగా భావిస్తున్న ఈ తరుణంలో రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభంజనం మళ్ళీ ఖాయమని వైసిపి శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నాయి. మరి రాజన్న బిడ్డగా కొన్ని కోట్ల మంది హృదయాలలో తన చిత్రాన్ని ముద్రించుకున్న జగన్ భవిష్యత్ రాజకీయాల్లో దేశంతో పాటు తన రాష్ట్రంలో ఎలాంటి పాత్ర పోషిస్తారు..? వైసీపీ కార్యకర్తల కలల సౌధాలను ఏ విధంగా చేరుకుంటారో కాలమే నిర్ణయించాలి. ఒక దీపం ఒక గదికి వెలుతుర్ని ఇస్తుంది కానీ చదువుల దీపం ఒక కుటుంబ రూపురేఖల్ని మార్చేస్తుందంటూ జగన్ చెప్పిన మాటలు జనాల గుండెల్లో బలంగా భద్రంగానే ఉన్నాయి. మరి ఆయన ఆశయాల దీపం ఎంతకాలం వెలుగులు పంచుతుందో మనమంతా ఆసక్తిగా ఎదురు చూద్దాం. ప్రజాక్షేత్రంలో రాష్ట్ర అభివృద్ధికై, ఈ దేశాభివృద్ధికై జగన్ చాలా బలమైన ప్రముఖ పాత్ర పోషించాలని ఆశిద్దాం. నేడు ఆంధ్రప్రదేశ్ లో 11 సంఖ్య చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. సచిన్ లాంటి ఆటగాడు కూడా ఆ 11 మందిలో ఒక్కడే. ఫలితాల్లో సంఖ్యలు మారడం,తదనంతరం ప్రభుత్వాలు మారడం పరిణామం లో సహజమని శతాబ్దాల చరిత్ర చెబుతోంది.అందుకే మనం గుర్తుంచుకోవాల్సింది సంఖ్య కాదు సత్యం మాత్రమే. సత్యమేవ జయతే.



- ఫిజిక్స్ అరుణ్ కుమార్
రవి కిరణ్ రెడ్డి
9394749536

# పిల్లలకు చేరలేకపోతున్న నీతి కథలు...

## నీతి కథలకు దూరమైన నేటి విద్యార్థులు

**మనం పిల్లలకు చెప్పే నీతి కథలు వారికి జీవిత పాఠాలని నేర్పే గొప్ప సాధనాలు. ముఖ్యంగా చిన్న పిల్లల పసి హృదయాలలో మంచి నడవడిని గురించి, ఐకమత్యం గురించి , మంచి చెడులను గురించి, సమయస్ఫూర్తి గురించి, దేశభక్తి మరియు దైవభక్తి గురించి తెలియచేస్తూ,వారి హృదయములో చెరగని ముద్ర వేసేవి మనం చెప్పే "నీతి కథలు".**

పిల్లలకి కథలంటే ఎంతో ఇష్టం."అనగనగా ఒక రాజు....."అని మనం కథను చెప్పడం ప్రారంభించగానే వారు కథను వింటూ ఊహాలోకంలో విహరిస్తారు. కథలో అంతర్గతంగా నీతి దాగి ఉంటుంది. మనం చెప్పే కథనే ఎంతో ఆసక్తితో వినటం వలన, అందులోని నీతి వారి మనస్సును హత్తుకు పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కథను వినేటప్పుడు వారు బయటి ప్రపంచాన్ని మర్చి పోతారు.వాళ్ళ ముఖకవళికలు గమనిస్తూ మనం కూడా మన హావభావాలు మార్చుతూ చెపుతున్నప్పుడు వారిలో కలిగే ఆనందం ను మనం వర్ణించలేము.

కానీ నేడు విశ్వవ్యాప్తంగా జరుగుచున్నదేమిటీ... అస్తవ్యస్తమైన ఉమ్మడి కుటుంబాలు, తీరిక లేని పనులు ,ప్రతి క్షణం డబ్బు కోసం ఆరాటం ఇలా జీవితం అంతా ఉరుకులు,పరుగులు. ఈ నేపథ్యంలో పిల్లలు కథలకు దూరం కాకూడదంటే, సాంస్కృతిక వారసత్వంగా వారికి అందుతున్న కథలు కోల్పోకూడదంటే ఆ భాధ్యతను మొదట తల్లిదండ్రులు తర్వాత పాఠశాలలోని ఉపాధ్యాయులు భుజస్కందాల పై వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంటే పిల్లలను టెక్నాలజీ ప్రపంచంలోని ఉంచుతూ కూడా నీతి కథలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసిన అవసరం ఎంతైనా ఉంది..

"చూసే" కథనం కంటే, "వినే" కథనంలో పిల్లల "ఊహాశక్తి" ఎక్కువగా ఉంటుంది.తర్వాత ఏమౌతుందోననే కుతూహలం వారిని ఆలోచింపచేస్తుంది.. వారికి మరింతగా ఊహించే అవకాశం కలుగుతుంది. ఒకప్పటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇప్పుడు లేదు. కుటుంబ వ్యవస్థలో పిల్లలకు కథలు చెప్పేంత తీరిక ఎవరికీ ఉండడం లేదు. పిల్లలకోసం కేటాయించే సమయం కూడా లెక్క ప్రకారం, రోజుకి ఇంత అని ఇస్తున్న తల్లిదండ్రులున్న ఈ హైటెక్ యుగంలో పిల్లలకు అందాల్సినంత ఆప్యాయత అందడం లేదు. ఉన్న తక్కువ సమయములో పిల్లలతో అనుబంధాన్ని పెంచేందుకు కథలు చెప్పడం ఎంతగానో తోడ్పడుతుంది. తల్లిదండ్రులు ముందుగా కథలను విని వాటిని తామే హవభావాలతో చెప్పగలిగితే పిల్లలతో కూడా మరింత అనుబంధం పెరుగుతుంది. అంటే పిల్లలకు, తల్లిదండ్రులకు కూడా ఒక ఆప్యాయతతో కూడిన అనుబంధం పెంచడానికి కథలు చెప్పడం తోడ్పడుతుంది.

విశ్వవ్యాప్తంగా ఖ్యాతి గాంచిన మన కథలలో పంచతంత్ర కథలు, పెదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు,భట్టి విక్రమార్క కథలు ,భేతాల కథలు, కాశిమజిలి కథలు, జానపద కథలు, అంతులేని కథలు ముఖ్యమైనవి. ,ప్రాచీన భారతీయ కథకుల యొక్క సృజనాత్మకతకు, ఊహాశక్తి కి, కథాకథనంనకు సాటిలేని మేటి ఉదాహరణగా ఎన్నో కథలు నిలిచాయి. శతాబ్దాలుగా భారతీయ సాహిత్యంలో చిత్ర విచిత్ర పాత్రలతో, అద్భుత, ఉత్సాహ భరితంగా సాగే ఈ కథలు కేవలం కుతూహలాన్ని రేకెత్తించే ఉల్లాసభరితమైన కాలక్షేప కథలు కావు. నిజానికి ఈ కథలు మానవుల ఊహాశక్తిని తర్కంతో, వివేచనతో పరిచయ చేస్తుంది. ఒక అంశాన్ని వివిధ కోణాల నుండి ఎలా చూడాలో, ఏ మేరకు సమన్వయం చేయాలో, తార్కిక ముగింపు ఎలా ఉండాలో చెపుతాయి. ముఖ్యంగా ఒక సమస్యను విభిన్న కోణాలలో ఆలోచించగల తార్కిక స్థాయిని చిన్నారులలో పెంపొందింపచేస్తాయి.

అందుకే ఈ కథలు పండితులకు, పామరులకు, అక్షరాస్యులకు,నిరక్షరాస్యులకు, పిల్లలకు, వయోవృద్ధులకు అనే భేదం లేకుండా అందరికి చెప్పడానికి అనుకూలంగా ఉన్నాయి.


ప్రాచీన భారతీయ కథా కౌశలానికి, భావనా శక్తికి, కల్పనా చాతుర్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ కథలు కాలక్రమంలో ఖండంతరాలను దాటి ప్రపంచ నలుమూలల విస్తరించాయి. "పంచతంత్రం" కథలను పరిశీలిస్తే ప్రతి జంతువు,ప్రతి పక్షి పాత్రలు పాత్రదారులుగా ఉన్నాయి. కానీ కథలు మాత్రం దేనికదే విడికథగా ఉండి, ప్రతికథకూ ప్రారంభమూ, ముగింపూ వేర్వేరు గా ఉంటాయి. ప్రతి కథలో ఒక నీతి లేదా ఒక మంచి తప్పకుండా ఉంటాయి.పిల్లలకు సులభంగా అర్థమై తక్కువ సమయములో ముగిసేలా ఉంటాయి.జంతువులతో పక్షులతో మాట్లాడించి కథను కొనసాగించిన విష్ణుశర్మ, చిన్నయసూరి లకు తెలుగు వారందరు ఋణపడి ఉన్నారు.

ప్రతి కథా యేదో ఒక మంచి విషయాన్ని కచ్చితంగా చెప్పేలా ఉంటుంది . అలా అని జీవిత సత్యాలను చెప్పేవి కాకుండా....వినడానికి ఆశక్తిని కలిగించే కథలు, ధైర్యసాహసాలు,ఐకమత్యమే మహాబలం లాంటి ఇతివృత్తాలను తెలియచేసే కథలు చిన్నారులను ఆకట్టుకుంటాయి. ఉమ్మడి కుటుంబాలుంటే తాతా, నాన్నమ్మ, అమ్మమ్మ లు కథలు చెప్పేవారు. ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రులు ఈ భాధ్యతను స్వీకరించాలి కాబట్టి వీరు చెప్పే కథలు సరళమైన తెలుగు భాషలో ఉంటూ చిన్నారులకు అర్థమయ్యే పదాలు మాత్రమే ఉండాలి. కథలలో వివిధ ప్రాంతాలలో వాడే ప్రత్యేక పదాలు,గ్రామీణ పదాలు,పర్యాయపదాలు,సామెతలు ఉండి చిన్నారులకు కొత్త పదాలను పరిచయం చేస్తుంది.

పది సంవత్సరాల వయసు వాళ్లకు చెప్పే కథలలో , తెలుగు భాషపై ఆసక్తిని పెంచేదిగా,కథనం ఊహకందని రీతిలో సాగేదిగా,సంక్లిష్టమైన పదాలు లేకుండా, తెలుగులో కనుమరుగు అవుతున్న పదాలనూ, జాతీయాలనూ, సామెతలను కలుపుతూ చెప్పడం వల్ల నేటి బాలలకు మన ప్రత్యేక పదజాలం ను కూడా పరిచయం చేసిన వారమవుతాం.

నీతి కథలకొరకు ప్రత్యేకంగా చందమామ, బాలమిత్ర లాంటి మాసపత్రికలు ఉన్నాయి. టెలివిజన్, వీడియో గేములు, కార్టూన్ ఛానల్స్, చేతిలో మొబైల్ లు,ఉచిత ఇంటర్నెట్ ఇవన్నీ లేని రోజుల్లో, పిల్లలకు మరియు పెద్దలకు ఎంతో వినోదాన్ని మరియు, విజ్ఞానాన్ని అందించేది కేవలం "చందమామ" లాంటి మాసపత్రికలు మాత్రమే. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే అమూల్యమైన గొప్ప బహుమతి ఏదైనా ఉందంటే అది "పిల్లలతో" ఎక్కువ సమయం గడపడం మాత్రమే అని గుర్తేరుగాలి. కానీ నేడు అదే లేక పోవడం విచారకరం

ప్రతి ఒక్కరు బిజీ బిజీ అంటూ పిల్లల కోసం కొంత సమయం కూడా కేటాయించలేకపోతున్నారు. గతంలోకి ఒకసారి వెళ్లి చూస్తే.. పని భారం ఉన్నప్పటికీ,రాత్రి సమయాల్లో తప్పకుండా తలిదండ్రులు తమ పిల్లలకు కథలు చెప్తూతూ గడిపేవారు.కానీ నేటి యుగంలో పని ఒత్తిడి, కుటుంబ భాధ్యతల మధ్య నలిగిపోతున్న తల్లిదండ్రులు తాము విన్న అ చిన్ననాటి కథలను జ్ఞాపకం చేసుకొని పిల్లలకు చెప్పే ఓపిక,సమయం లేదనుకోవడం విచారకరం. అ మాట కొస్తే కథలు వినడం చిన్నారులకు ఎంత అవసరమో, చెప్పడం అమ్మా నాన్నలకు అంతే అవసరం ఎందుకంటే " కథలు చెప్పడం మనం ఆపేస్తే, అవి క్రమంగా అంతరించిపోతాయి. అంతరించిపోయిన ఆ కథలతో పాటు మన అస్తిత్వం, మన చరిత్ర అంతరించిపోతుంది. చిన్నపిల్లలకు కథలు చెప్పడం ఎంత ముఖ్యమో ఇంట్లొ ఉండే పెద్దవారు గుర్తించాల్సిన అవసరం ఉంది.మన భారతీయ చరిత్ర మరియు పురాణాలు పరిశీలిస్తే చిన్నతనంలో వారి తల్లి చెప్పిన కథల వల్ల ప్రేరణ పొందామని ఎందరో గొప్పవారు తెలియచేశారు.



- గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.
9963499282

ప్రతి చిన్నారి తెలియని అనేక విషయాలు తెలుసుకోవాలంటే,వారిలో సృజనాత్మకత పెరగాలంటే వారికి కథలు చెప్పడం అనేది ఒక అద్భుతమైన విధానం. నేటి పిల్లలకు అటు పాఠశాల్లో లేదా ఇంట్లో కానీ కథలు వినడానికి అవకాశం లేదు. ఎందుకంటే రెండు సంవత్సరాలు నిండడం తోనే చిన్నారులను పాఠశాలలో చేర్చడం,ర్యాంకులకోసం పరిగెత్తించడం తోనే జీవితం గడిచిపోతుంది.చదువులో ఎన్ని మార్కులు వచ్చాయంటాం కానీ నీకెన్ని కథలు వచ్చు అని మనం అడుగం.

అప్పుడప్పుడు ప్రముఖుల ఉపన్యాసంలో సందర్భానికి తగిన కథను చెప్పేవారు. దీనిని "పిట్టకథ" అని అంటారు. కథలు పిల్లలలో, సాహస వీరుల కథలు, దయాగుణం తెలిపే కథలు, సమస్యను తెలివిగా పరిష్కరించే కథలు, అద్భుతమైన ఊహ ప్రపంచములోకి తీసుకొని వెళ్లే కథలు, హాస్య భరితమైన కథలు, దేశభక్తి మరియు దైవ భక్తి ని కలిగించే కథలు చిన్నారుల్లో వినోదాన్ని మరియు విజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతున్నాయి.

తెలుగు సాహిత్యంలో మహభారతము,రామాయణం మరియు భాగవతంలో కూడ అనేక కథలు ఉన్నాయి. చిత్రవిచిత్రాలైన మహిమలతో, మలుపులతో, వినోదభరితంగా ఉండి మంచి నడవడికను తెలియ చేస్తున్నాయి. కావునా పెద్దలారా....మీరు మీ చిన్నారులకు నీతి కథలు నేర్పిస్తూ,వారిని మిగిలిన పిల్లలకు చెప్పేలా ప్రోత్సహిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కు చేయందిస్తారని ఆశిస్తున్నాను.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369
39999

# ఆరుట్ల గ్రామ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ

- అక్రమాలకు పాల్పడినట్లు అభియోగాలు
- విధులను దుర్వినియోగం చేస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్




**ఇబ్రహీంపట్నం, మహా:** ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శికి, డిపిఓ సురేష్ మోహన్ సోకాజ్ నోటీస్ ఇచ్చారు. మంచాల మండలం, ఆరుట్ల పరిధిలో గల తెలంగాణ అరకు అనే రిసార్ట్ నిర్మాణం అనుమతులలో అవకతవకలు చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ, పన్ను వసూలల్లో అక్రమాలకు పాల్పడుతున్నాడని, అభియోగాలు రావడంతో గ్రామ కార్యదర్శి వెంకటేష్ కు, రంగారెడ్డి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి సురేష్ మోహన్, వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో డిపిఓ ఆదేశాల మేరకు డిఎల్పిఓ, తెలంగాణ అరకు అని రిసార్టును పర్యటించి పర్యవేక్షించిన విషయం విధితమే. అనంతరం పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకిస్తూ, అక్రమ నిర్మాణాలకు సహకరించినా, విధులను దుర్వినియోగం చేసిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఏ స్థాయి ఉద్యోగి నైనా ఉపేక్షించేది లేదని, డిపిఓ సురేష్ మోహన్ హెచ్చరించారు.

**జిల్లా వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు అనేకం...**

జిల్లాలో, గ్రామ పంచాయతీలలో, మున్సిపాలిటీలలో అనుమతులకు మించి అక్రమ రిసార్ట్లు, భవనాల నిర్మాణాలు అనేకం వెలిశాయి. అనుమతులు గోరంత నిర్మాణాలు కొండంత చేపడుతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాజకీయ నాయకుల పలుకుబడితో అక్రమంగా రిసార్ట్ నిర్మాణాలు చేపడుతున్నారు. జి ప్లస్ టు అనుమతులతో జి ప్లస్ ఫోర్, ఫైవ్ భవనాలు నిర్మిస్తూ సమస్యలు సృష్టిస్తున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

# పి.ఆర్.పి. తక్షణమే అమలు చేయాలి

## సింగరేణి అధికారుల సంఘం (పి.ఎం.ఓ.ఏ.ఐ.) నిరసన



**మందమర్రి, మహా :** సింగరేణి అధికారుల వేతనాలలో పి.ఆర్.పి. తక్షణమే అమలు చేయాలని కోరుతూ మందమర్రి ఏరియా అధికారుల సంఘం (పి.ఎం.ఓ.ఏ.ఐ) అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో జి ఎం కార్యాలయం ఆవరణలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పి.ఆర్.పి. చెల్లింపులో యాజమాన్యం అసాధారణ జాప్యాము చేస్తుందని మండిపడ్డారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాలలో నిద్రాహారాలు మాని కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో అధికారుల కీలక పాత్ర అని అన్నారు. అయినా కూడా సింగరేణి సంస్థ అధికారులకు ఫ్రీ ఎలక్ట్రిసిటీ చార్జెస్, ఐఐటి, ఐఐఎం ఫీజ్ రింబర్స్మెంట్ వర్తింపులతో పాటు అధికారులు దీర్ఘ కాలిక పదోన్నతుల ఇవ్వడంలో మొండికేస్తుందని దుయ్యబట్టారు. ఈ సమస్యల పరిష్కారం లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సింగరేణి వ్యాప్తంగా అధికారుల సంఘం ఇచ్చిన నిరసనలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. మందమర్రి వ్యాప్తంగా వివిధ గనులు డిపార్ట్మెంట్లలో అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో మందమర్రి జిఎం జి దేవేందర్, ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్, సివిల్ ఎస్.ఇ రాము,పీఎం శ్యాంసుందర్, బి శంకర్, ఆర్ సత్యనారాయణ, ఎండి ఆఫీస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం




**ఆదిలాబాద్ మహా :** అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో అక్టోబర్ 31 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. అవగాహన కార్యక్రమాల వివరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల పట్ల విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మెడికల్ సిబ్బంది సైతం పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హాట్ స్పాట్స్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లో లెవెల్ వంతెనల వద్ద నీటి ప్రవాహం ఉన్న సమయంలో అటుగా వెళ్లవద్దని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 0.3 శాతం ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఉన్నాయని డీఎం హెచ్ వో డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. గతంతో పోలిస్తే కేసుల సంఖ్య తగ్గిందన్నారు. వ్యాధి నివారణ చర్యలపై విద్యా సంస్థల్లో అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. వ్యాధి సంక్రమించినవారు ఆత్మ స్థైర్యం కోల్పోకుండా క్రమం తప్పకుండా మాత్రలు తీసుకుంటూ వ్యాయామం చేయాలని సూచించారు. అనైతిక లైంగిక చర్యల వల్ల వ్యాధి సోకుతుందని, రక్తం ట్రాన్స్ఫర్ చేసే సమయంలోనూ పూర్తి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎయిడ్స్ పరిక్షలతో పాటు.... ఉచితంగా వైద్య చికిత్సలను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్నామన్నారు.



# పొలాల పండగకు ఘనమైన ఏర్పాట్లు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లాలో పొలాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు,సంబధిత అధికారులు గ్రామస్తులతో కలసి మంగళవారం క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. జిల్లా యంత్రాంగం టూరిజం శాఖ, డిఆర్డిఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ , డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు . పండుగకు సంబంధించి ఏర్పాటు చేసిన డేమో కార్యక్రమాన్ని తిలకించారు. స్థానిక అధికారులు, గ్రామస్తులతో ఏర్పాట్ల ప్రగతి పై సమీక్షించారు. పండుగ సందర్భంగా పర్యాటకులకు అందించబోయే సాంస్కృతిక కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య పరిస్థితులు మొదలైన అంశాల పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో పొలాల పండుగను సంస్కృతి సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించుకుంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా అన్ని ఏర్పాట్లూ సమర్ధవంతంగా ఉండాలన్నారు.పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, హస్తకళల ప్రదర్శనలు, తినుబండారాల స్టాళ్లు, జానపద నృత్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఇటీవలే మత్తడి వాగులో పూడిక తీసిన తరువాత నీరు పుష్కలంగా వస్తుందని, ఈ స్థలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి రవి, డీఆర్డీవో రవీందర్, డీపీవో రమేష్, ఎంఆర్ఓ లక్ష్మీ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ దేవాలయాలపై దాడులను ఖండించిన కార్పొరేటర్



## బిజెపి నాయకులు హౌస్ అరెస్ట్

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులతో కలసి ఛలో బంజారాహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయనికి బయల్దేరే క్రమంలో పోలీసులు అడ్డుకొని మంగళవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వంలో ఉన్నాము కదా అని నాయకుల ఆదేశాలతో పోలీసులు ఇలా దౌర్జన్యంగా బీజేపీ నాయకులను అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ అధ్యక్షులు అడిగే జనార్ధన్, రావుల భాస్కర్, బబ్లూ, బుచ్చిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎన్నూ శంకర్ రెడ్డి, పొప్పట్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## గురునానక్ లో యాంటీ ర్యాగింగ్

# అవగాహన సదస్సు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మహేందర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎస్ హెచ్ ఓ ఎం. మహేందర్ రెడ్డి, ఎస్సై రామకృష్ణ విద్యార్థులకు ర్యాగింగ్ పట్ల అవగాహన కల్పించారు. సిఐ మాట్లాడుతూ... ర్యాగింగ్ దుష్ప్రభావాలు, నిబంధనలు, దానికి వ్యతిరేకంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ర్యాగింగ్ ముప్పును అర్థం చేసుకుని, ఒక స్నేహపూర్వక, సురక్షిత విద్యా వాతావరణాన్ని సృష్టించుకునేందుకు అనుకూలంగా వ్యవహరించాలని వారు విద్యార్థులకు సూచించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ కులపతి గగన్ దీప్ కోహ్లీ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ హెచ్ ఎస్ సైని కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియచేసారు. కార్యక్రమంలో డాక్టర్ పార్థసారధి, డాక్టర్ కె వెంకటరావు, ప్రిన్సిపాల్కే, డాక్టర్డా కేదార్నాథ్ (అసిస్టెంట్ డైరెక్టర్), డాక్టర్ అంజయ్య మరియు ఇతర విభాగ అధిపతులు పాల్గొని విద్యార్థుల్లో ర్యాగింగ్ పట్ల అవగాహన, దాని దుష్ప్రభావాలపై తీసుకోవలసిన జాగ్రత్తలు, సమాజంలో సానుకూల మార్పుకు దారి తీసే విధంగా విద్యా వాతావరణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు తమతో చేయి కలిపి ముందుకు వెళ్ళడానికి మద్దతు అందినట్లు విద్యార్థులకు సూచించారు.

# లాడ్జ్‌లో వ్యక్తి ఆత్మహత్య

**కాగజ్ నగర్, మహా:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ వ్యక్తి ఆత్మహత్య కలకలం రేపింది. కాగజ్‌నగర్ పట్టణంలోని రాజ్‌కుమార్ లాడ్జ్‌లో బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన నరేష్ (40) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరితనం భరించలేక లాడ్జ్ గదిలో ఉరి వేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# గంజాయి పట్టివేత

**ఆసిఫాబాద్ మహా :** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టాస్కోఫ్ర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్కోఫ్ర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ పట్టణంలోని పంజాబీ దాబా వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఖైరగాం చెందిన గన్నా శ్రావణ్ కుమార్. మహారాష్ట్ర రాజురకు చెందిన అరుణ్ రామారావు తనిఖీ చేయగా 60 గ్రాముల గంజాయి. 10 ప్యాకెట్లు లభ్యమయ్యాయి. గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరి పై కేసు నమోదు చేసి సీఐ పేర్కొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషన్ మోడీ చేతిలో కీలుబొమ్మగా మారింది

## ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన. కాంగ్రెస్ శ్రేణులు




**రాజేంద్రనగర్, మహా ;** రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు నిరసనగా, శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని, బస్టాండ్ చౌరస్తా వద్ద, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో, పాత కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి, మంగళవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి. దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ తో కేంద్ర ప్రభుత్వం కలిసి సామాన్య ప్రజల ఓట్లను కొల్లగొట్టిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడ్డ బిజెపి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఎన్నికల కమిషన్ కార్యాలయానికి శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి వెళుతుంటే రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీలను అడ్డుకొని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. బీహార్ లో జరుగుతున్న ఓటర్ లిస్ట్ ల తారుమారు రాబోయే ఎన్నికలకు ముప్పు కలిగిస్తుంది అన్నారు. బిజెపి ఎన్నికల కమిషన్ ను అడ్డుపెట్టుకొని ఓట్ల చోరీకి పాల్పడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రజలు బిజెపి పార్టీకి గుణపాఠం చెప్తారు అన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు సదాలక్ష్మి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్, సీనియర్ నాయకురాలు మైలారం సులోచన, విజయ యాదవ్, శంషుద్దీన్, శ్రీకాంత్ యాదవ్, తాజ్ బాబా, గణేష్ నాయక్, కుమార్, అంజయ్య యాదవ్, ప్రవీణ్ కుమార్, నరసింహ, శ్రీధర్ యాదవ్, రవి నాయక్, అక్రమ భాయ్, గని బాయ్, శేఖర్ ముదిరాజ్, చందు యాదవ్. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు

**రాజేంద్రనగర్ మహా ;** ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి, శంషాబాద్ ఇంచార్జ్ శివ ఆధ్వర్యంలో, అఖిల భారత విద్యార్థి సమైక్య , ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవంను, మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవానికి ముఖ్య అతిధిగా, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గ్యార క్రాంతి కుమార్ హాజరై ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, భారత దేశ స్వాతంత్ర్యం కోసం, పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. దేశ స్వాతంత్రమే లక్ష్యంగా, దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా, ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహ నగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల, ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం, బబ్బుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల, బానిస చేర నుంచి, మాతృభూమి విముక్తికై, సాగిన వీరోచితంగా పోరాడిన మొట్టమొదటి విద్యార్థి సంఘం అన్నారు. ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు గల్లి నుండి డిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడుతున్నము. తెలంగాణ పోరాటంలో, హాస్టళ్ల సమస్యలపై, విద్య వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేశాము. పూర్వ విద్యార్థి నాయకులకు, కార్యకర్తలకు, విద్యార్థిని విద్యార్థులకు, మిత్రులకు 90వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధి లేదు. అనేగా హాస్టల్స్ కూలిపోతున్నాయని మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. గురుకులాల్లో విద్యార్థులు ప్రాణాలను కోల్పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాలయాలకు సముచిత స్థానం అధిక నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలా ధర్మారెడ్డి,అమీర్,వినోద్,చందు, నరేష్,హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు





# ఒక కోటి స్వాహా..?

- మోసం చేశారంటూ బ్యాంకు ముందు ఆందోళన
- బుక్ కీపర్ మేనేజర్ పై అనుమానం?

**రంగారెడ్డి జిల్లా మహా:** మహిళా సంఘాల సభ్యులను నకిలీ సంతకాలతో నిలువునా ముంచిన ఉదాంతం చౌదర్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. యాచారం మండలం చౌదరి పల్లి జరిగిన ఉదాత్తం గురించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామంలోని దాదాపు 25 మహిళా డ్వాక్రా గ్రూపుల సభ్యులకు తెలియకుండా, వారి సంతకాలను ఫోర్జరీ చేసి దాదాపుగా ఒక కోటి వరకు స్వాహా చేసినట్లు ఆరోపిస్తూ, ఆందోళన చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని యాచారంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం ముందు ధర్నా చేస్తూ, బ్యాంకు సేవలను అడ్డుకున్నారు. తాము తీసుకున్న రుణం ప్రతి నెల బ్యాంకుకు వెళ్లి చెల్లించినా, తాము తీసుకున్న అప్పు మొత్తం తీరలేదని బ్యాంకు అధికారులు తెలపడంతో ఆందోళన చెందారు. తాము బ్యాంకులో చెల్లించిన రసీదులపై స్టాంపు మేము వెయ్యలేదని బ్యాంక్ అధికారులు అంటున్నారని, బుక్ కీపర్ బ్యాంకు మేనేజర్ కలిసే నిధులను స్వాహా చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని, బ్యాంకు మేనేజర్ బయటికి వచ్చి సమాధానం చెప్పాలని మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకొని, మహిళా సంఘాల సభ్యులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపినట్లు మహిళా సంఘాల సభ్యులు అన్నారు.

# దేశం కోసం పోరాడిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌ది

## రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**హైదరాబాద్, మహా:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పేర్కొన్నారు. హిమాయత్ నగర్‌లోని అమృత ఎస్టేట్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శ్వేత అరుణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ 89 వసంతాలు పూర్తి చేసుకుందని, ఆనాడు దేశ వ్యాప్తంగా విద్యార్థులను సంఘటితం చేసి బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసి దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. నాటి నుండి నేటి వరకు దేశ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కి ఉన్నదని గుర్తు చేశారు. బీజేపీ సర్కార్ విద్యను కాషాయికరణ,ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని, నీట్ పేపర్ లీకేజి జరిగి దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు.



## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 13.3 కిలోల

# హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం

## దీని విలువ సుమారు 13.3 కోట్లు



**రాజేంద్రనగర్ మహా ;** నిర్దిష్ట సమాచారం మేరకు హైదరాబాద్ జోనల్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి ఇండిగో ఎయిర్ వేస్ లో వస్తున్న భారతీయ మహిళా ప్రయాణికురాలను పక్క సమాచారంతో అడ్డుకొని తనిఖీలు నిర్వహించారు. ఆమె వద్ద గల లగేజీలో 20 పాకెట్లలో 13,3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని డైరెక్టరేట్ అఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అక్రమ మార్కెట్లో సుమారు 13,3 కోట్లు ఉంటుందని అంచనా. ప్రయాణికురాలని నార్కోట్రిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సాబ్ స్టాన్సెస్, ఎన్ డి పి ఎస్ చట్టం, 1985 నిబంధనల కింద అరెస్టు చేసి జ్యూడిషియల్ కస్టడీకి తరలించారు. కేసు తదుపరి దర్యాప్తులో ఉందిని అధికారులు తెలిపారు.

## చట్ట ప్రకారం గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గిరిజనుల సమస్యలపై జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, డి.సి.పి. ఎ. భాస్కర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం 2005 కంటే ముందు నుండి పోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులకు పట్టాలు అందించి జీవనాధారం కల్పించడం జరుగుతుందని అన్నారు. కొంతమంది గిరిజనులు ప్రస్తుత కాలంలో అటవీ భూమిని ఆక్రమించి పోడు వ్యవసాయం సాగు చేస్తూ పట్టాలు అడుగుతున్నారని చెప్పారు. షెడ్యూల్డ్ తెగలకు ప్రభుత్వాలు కల్పించిన హక్కుల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నట్టు వివరించారు. అర్హులైన గిరిజనులకు అటవీ భూములలో వెదురు సాగు చేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని, సాగుకు అవసరమైన మొక్కలు, కూలీల ఖర్చులు ప్రభుత్వం అందించి పంటను విక్రయించుకునేందుకు ఆయా సంస్థలతో ఒప్పందాలు చేయించి గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు మెలకువలు అందించి, కూలీల ఖర్చులు, మొక్కలు, సాగు నీటిని అందించి పంట దిగుబడిని విక్రయించుకునేలా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 5 శాతం ఉద్యానవన పంటల సాగు జరుగుతుందని, జిల్లాలోని దేవునిపల్లి గ్రామంలో 150 హెక్టార్ల విస్తీర్ణంలో గిరిజనులతో మల్బరీ సాగు చేయించడం జరుగుతుందని తెలిపారు. మల్బరీ సాగు సంవత్సరం నుండి సంవత్సరన్నర కాలంలో దిగుబడి వస్తుందని, గిరిజనులు సమన్వయంతో ఒక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని, పంట సాగులో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపామని అన్నారు. పంట ఉత్పత్తి విక్రయించుకునేందుకు గిరిజన కార్పొరేషన్ ద్వారా కనీస మద్దతు ధర నిర్ణయించడం జరుగుతుందని, గిరిజనుల కోసం గోదాం, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కోటపల్లి, వేమనపల్లిలో మల్బరీ సాగులో ఉత్పత్తితో పాటు దారం తయారు చేసేందుకు గిరిజన రైతులకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డెన్, కేర్ టేకర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, కవ్వాల్ లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను మండల తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి తో కలిసి సందర్శించారు. అనంతరం తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, హాజరు పట్టికలు, మూత్రశాలలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ చార్జీలను పెంచి నూతన మెనూ అమలు చేస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని అన్నారు. వంట చేసేవారు ప్రత్యేక శ్రద్ధ, శుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, బడి వయసు గల పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించాలని తెలిపారు. జన్నారం ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసాల పట్ల జాగ్రత్త

**జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

**ఆసిఫాబాద్ మహా :** ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. సోషల్ మీడియా లేదా ఆన్‌లైన్ యాడ్స్‌లో అధిక లాభాలు, లాటరీ, గిఫ్ట్, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని హెచ్చరించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ సందేశాలకు స్పందించవద్దని, ముఖ్యంగా బ్యాంక్ ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిషేధించిన బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్, లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకుని యువత ఆత్మహత్యల వంటి తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.లోన్ యాప్‌ల ద్వారా వేధింపులకు గురైతే వెంటనే 100 లేదా 1930 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

## సుప్రీం కోర్టు తీర్పులను అమలు చేయాలి

**2021లో విడుదల చేసిన 5 ప్రిలిమినరీ జీఓలను వెంటనే గెజిట్ చేయాలి**

**సిఐటియు ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా**




**మంచిర్యాల, మహా :** కనీస వేతనాల పెంపుకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందర సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఎస్సీ కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్ lu ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ ధర్నా కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు వెల్లడించారు. 2021లో విడుదల చేసిన 5 ప్రిలిమినరీ జీఓలను వెంటనే గెజిట్ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన గత పదేళ్ళలో 4 కనీస వేతనాల సలహా మండళ్ళను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిస్ జీవోలలో కనీస వేతనాల నిర్ణయం సవరణల గురించి ప్రభుత్వానికి పలుసార్లు సిఫారసులు కూడా చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆ సిఫారసులను బుట్టదాఖలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు జారీ చేసిన జీవోలను గెజిట్ చేయకపోవడం వల్ల ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు కార్మికులు నష్టపోతున్నారని వివరించారు. కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కనపెట్టి కేబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయాపనకు స్వస్తి చెప్పాలని డిమాండ్. ఈ ఆందోళనలో సిఐటియు నాయకులు సంకె రవి, గోమాస ప్రకాష్, కాసిపేట రాజేశం సీఐటీయు నస్పూర్ మండల కన్వీనర్, మహేందర్ ఎస్సి.కె.ఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు, సమ్మయ్య సతీష్, శ్రీశైలం సద్దాం సంపత్ ప్రవీణ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## వరద సహాయక చర్యల్లో ఇన్స్‌పెక్టర్ బొల్లం రమేష్

**వరంగల్ మహా;** రాత్రి కురిసిన భారీ వర్షంతో నగరం అతలాకుతలమైంది. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ప్రాంత పరిధిలోని పలు కాలనీలు ముంపునకు గురైయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో మిల్స్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి మిల్స్ కాలనీ సీఐ రమేష్, సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆ ప్రాంతంలో ఇళ్లల్లోకి నీరు రావడంతో చిన్నారులను సిఐ రమేష్ ఎస్సై సురేష్ తో కలిసి స్వయంగా వారిని ఆ ప్రాంతం నుండి సురక్షిత ప్రాంతానికి తమ చేతుల పై తీసుకొనివచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని మిల్స్ కాలనీ సర్కిల్ ఇన్ స్పెక్టర్ బొల్లం రమేష్ సూచించారు.



## ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లోనే నిర్మించాలి

**కలెక్టర్ ను కలిసి వినతిపత్రాన్ని అందజేసిన జేఏసీ నాయకులు**

**ఖానాపూర్ మహా :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ కు మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఏర్పాటు చేయాలని, జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు , ఇదే విషయమై గత కొన్ని నెలల నుండి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జేఏసీ కన్వీనర్ నందిరామయ్య అన్నారు. ఖానాపూర్ మండలం తిమ్మాపూర్ శివారులో గల 110 ఎకరాల భూమికి సంబంధించినటువంటి సర్వే ను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు .ఆ సర్వే కి సంబంధించిన రిపోర్టును మంగళవారం ఖానాపూర్ తాసిల్దారును అడగగా కలెక్టర్ కార్యాలయం నుండే తీసుకోవాలని ఎమ్మార్వో సూచించినట్టు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ ను కలిసి ఆ రిపోర్టు తమకు ఇవ్వాలని కోరినట్టు వివరించారు. ఇక్కడ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంటిగ్రేటెడ్ స్కూలు ఖానాపూర్ నుండి ఎటు కూడా తరలించవద్దని అది ఖానాపూర్ లోనే నిర్మించాలని జేఏసీ తరఫున డిమాండ్ చేశారు..

## వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా ;** వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ నుండి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసిల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం రాత్రి భారీ వర్షాలు కూరవడం పై జిల్లాలోని అన్ని మండలాల్లో పరిస్థితులను సమీక్షించి సహాయక చర్యలు సమర్థవంతంగా నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా అత్యవసర సహాయార్థం ప్రజల కొరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 1800 425 3424 టోల్ ఫ్రీ నెంబర్ కు 9154252936 మొబైల్ నంబర్ కు అదేవిధంగా వరంగల్ పట్టణానికి సంబంధించి జిడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 1800 425 1980 టోల్ ఫ్రీ నెంబర్ కు 9701999676 నెంబర్ల కు సంప్రదించాలని సూచించారు.తాసిల్దార్లు, ఎంపీడీవోలు తమ మండల పరిధిలోని లు గ్రామాలు జల మాయమయ్యే ప్రాంతల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంటుందని, కావున రోడ్డు రవాణా విద్యుత్ సరఫరాలో అంతారం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, విద్యుత్, రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని తెలిపారు.

## వరంగల్ హన్మకొండ జిల్లాల్లో కుండపోత వర్షం

**రహదారులు జలమయం.. స్తంభించిన జనజీవనం**

**జలదిగ్బంధంలో నగరంలోని పలు కాలనీలు**

**లోతట్టు ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, కమీషనర్**



**వరంగల్, హన్మకొండ మహా ;** వరంగల్, హనుమకొండ, కాజీపేట లో కుండపోత వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరుతో పాటు డ్రైనేజీ కాలువలు ఉప్పొంగి మురుగునీరు నిలిచింది. కాజీపేట, హసన్పర్తి, రెడ్డిపురం, గోకుల్ నగర్, అంబేడ్కర్ నగర్, న్యూ శాయంపేట లో వరద నీరు, డ్రైనేజీ నీరు నిలవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. వరంగల్ నగరంలో భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. బట్టల బజార్, పాత బీటు బజార్లో రోడ్డు పై వరద నీరు భారీగా నిలిచింది. హంటర్ రోడ్డు, ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ, రామన్నపేట, శివనగర్, కరీమాబాద్, సాకరాశి కుంటలో కాలనీలు జలమయమయ్యాయి. వరంగల్ రైల్వే స్టేషన్లో భారీగా నీరు నిలిచింది. ఉర్సు గుట్ట సమీపంలో డీకే నగర్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఇక్కడి గుడిసె వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారి పై వరద నీరు నిలిచింది. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. వరంగల్ జిల్లా లోని సంగెం మండలంలో 20 సెం.మీ. వర్షపాతం, ఖిల్లా వరంగల్ ప్రాంతంలో 14.8 సెం.మీ, వర్ధన్నపేట లో 12 సెం.మీ, పర్వతగిరి లో 10.7, వరంగల్ లో 9.5 సెం.మీ, గీసుకొండ లో 9.2 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా వరంగల్ నగరంలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లడంతో వరద నీరు ఇళ్లను ముంచెత్తింది. పలు మండలాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే దుగ్గొండి లో 84.2 మి.మీ, నల్లబెల్లి లో 66.4 మి.మీ, నర్సంపేటలో 86.4 మి.మీ, చెన్నారావుపేట లో 85.4 మి.మీ, రాయపర్తిలో 90.8 మి.మీ, పర్వతగిరి లో 88.6 మి.మీ, నెక్కొండ లో 82.4 మి.మీ భారీ వర్షం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

**ఖిలా వరంగల్ అగడ్త చెరువు ఉ[illegible]**

ఖిలా వరంగల్ అగడ్త చెరువు ప్రమాదకర స్థాయిలో నిండిపోయింది. రిటర్నింగ్ వాల్ పై వరకు నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద ధాటికి చెరువు వెనకాల ఉన్న సుమారు 100 ఎకరాల పంటలు నీట మునిగాయి. ఈ పరిణామంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఖిలా వరంగల్ చెరువు పొంగిపొర్లుతుండడంతో ఆ నీరంతా శివనగర్, మైసయ్య నగర్‌లో లోతట్టు ప్రాంతాలను నీట ముంచాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు.

**రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద నుంచి రాకపోకలు బంద్**

వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తెల్లవారుజామున ఎవరు లేకపోవడంతో ఒక కారు నీటిలో మునిగిపోయింది. అదృష్టవశాత్తూ, స్థానికులు వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో కారును బయటకు తీశారు. అధికారుల నుంచి సకాలంలో ఎలాంటి సహాయక చర్యలు అందలేదని స్థానికులు వాపోతున్నారు.

**ప్రధాన రహదారుల పైన వరద ప్రభావం**

వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై అక్కడక్కడ నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో భారీ వాహనాలు మినహా బైకులు, ఆటోలు, కార్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే బొల్లికుంట చెరువు అలుగు పోస్తుండడంతో గుంటూరు పల్లి, బొల్లికుంట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వందల ఎకరాల్లో పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయి చెరువులను తలపింప చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ రైల్వే స్టేషన్ కు భారీగా వరద పోటెత్తింది. ఒకటి, రెండవ ప్లాట్ ఫామ్ ల మధ్య పట్టాలు కనిపించనంత భారీగా వరద నీరు చేరగా రైల్వే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

## సైబర్ నేరంతో మోసపోయిన బాధితునికి చెక్కు పంపిణీ




**భూపాలపల్లి, మహా :** సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయిన బాధితునికి రూ 1,20 వేల చెక్కును మంగళవారం భూపాలపల్లి పట్టణ సీఐ డి నరేష్ కుమార్ పంపిణీ చేశారు.మంజూర్నగర్ కు చెందిన బొప్పర్తి హరికృష్ణ యూట్యూబ్ ప్రీపెయిడ్ టాస్కుల పేరుతో బాధితుని నుండి సైబర్ మోసగాళ్లు రూ. 1,75,000 దోచేశారు.సైబర్ మోసమని గ్రహించిన బాధితుడు వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.రూ.1,54,500/ హోల్డ్ అయ్యాయని, ఇట్టి విషయమై బాధితుని యొక్క ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి, మొదటి విడతగా రూ.1.20 వేల చెక్కుని కోర్టు ద్వారా బాధితునికి అందజేసినట్లు భూపాలపల్లి పట్టణ సిఐ డీ నరేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో లాగిన్ అయి గాని ఫిర్యాదు నమోదు చేసి పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని సీ ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితునికి సకాలంలో రిఫండ్ అందజేయడంలో కృషిచేసిన సైబర్ వారియర్ తిరుపతిని సీఐ అభినందించారు.




## బాధిత కుటుంబానికి 10 లక్షల ప్రమాదబీమా

**భైంసా మహా :** నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రానికి చెందిన బొడ్డు యశోద పాము కాటుతో మృతి చెందడంతో మృతిరాలి భర్త బొడ్డు పోతన్నకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ 10 లక్షల రూపాయల ప్రమాద భీమా చెక్కును అందజేశారు. మహిళలు తప్పనిసరిగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ఇందిర మహిళా శక్తి ప్రమాద బీమా కష్ట కాలంలో అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాథోడ్ ఉత్తమ్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, ఐకేపీ సి. సి. సరస్వతి, బిజెపి నాయకులు సత్యనారాయణ్ గౌడ్, యేశాల దత్తాత్రి, సంప్లీ రమేష్, గులాబ్, నాగేందర్ తదితరులు ఉన్నారు.

## రేగొండ మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నిక





**భూపాలపల్లి, మహా :** రేగొండ మండల ఆర్య వైశ్య సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. రేగొండ మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా తనుకు రాజయ్య ఎన్నికయ్యారు. ఒక్కరే నామినేషన్ వేయడం తో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు. వైశ్య సంఘం నాయకులు మద్ది లక్ష్మీ నరసింహమూర్తి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి తనుకు శ్రీనివాస్ లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన తనకు రాజయ్య చే భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులు తనుకు రాజయ్య మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా జూలూరి గోవర్ధన్, కోశాధికారిగా గోరంట్ల వీరన్న , ఆర్య వైశ్యయూత్ అధ్యక్షుడుగా అయిత నరేష్, ప్రధాన కార్యదర్శి కల్లూరి వీరేష్, కోశాధికారి గోరింటల శ్రవణ్ లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కమిటీ సభ్యులందరికీ నూతన అధ్యక్షులు తణుకు రాజయ్య పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులను మండల వైశ్య సంఘం నూతన కార్యవర్గం శాలువాతో సత్కరించారు కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ను తాజా మాజీ అధ్యక్షులు మాధురి ముక్తేశ్వర్ శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు నరేంద్రుల ధనలక్ష్మి,మాజీ అధ్యక్షులు మదూరి ముక్తేశ్వర్, ఆకుల శ్రీనివాస్, శ్రీరాం రమేష్, కొమురవెల్లి సంతోష్, ఏర్రం సదాశివా మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పేకాట రాయుళ్ల భరతం పడుతున్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం దిమ్మ గ్రామ శివారులో పక్కా సమాచారం మేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని బృందం పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసారు. జూదమాడుతున్న బొంపల్లి నరేష్, సురుకుంటి హరీష్ రెడ్డి, మద్దికుంట్ల పురుషోత్తం, అడ్డి నరేందర్ రెడ్డి, మద్దికుంట వెంకన్న, లోక కిష్టారెడ్డి, సోమ గణేష్ రెడ్డి,లపై కేసు నమోదు చేసారు. వారి వద్ద నుండి 7 మొబైల్ ఫోన్లు, 8610 రూపాయల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్ తెలిపారు.

# ఇండియాలో అత్యంత ధనిక కుటుంబాలు




హురున్ ఇండియా 2025లో అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల జాబితాను విడుదల చేసింది. ఇందులో అంబానీ ఫ్యామిలీ మళ్ళీ అగ్రస్థానంలో నిలిచింది. ఈ కుటుంబ వ్యాపార విలువ రూ. 28.2 లక్షల కోట్లు. ఇది భారతదేశ జీడీపీలో పన్నెండవ వంతు. ఆ తరువాత జాబితాలో కుమార్ మంగళం బిర్లా కుటుంబం ఉంది. వీరి ఫ్యామిలీ బిజినెస్ వాల్యూ రూ. 1.1 లక్షల కోట్లు పెరిగి రూ. 6.5 లక్షల కోట్ల విలువకు చేరుకుంది. మూడో స్థానంలో జిందాల్ కుటుంబం (రూ. 5.7 లక్షల కోట్లు) ఉంది. భారతదేశంలో అత్యంత విలువైన కుటుంబాల జాబితాలో నిలిచిన మొదటి మూడు ఫ్యామిలీల విలువ రూ. 40.4 లక్షల కోట్లు. ఇది ఫిలిప్పీన్స్ జీడీపీకి సమానం అని తెలుస్తోంది.

## భారతదేశంలోని టాప్ 10 ధనిక కుటుంబాలు

- అంబానీ కుటుంబం: రూ. 28,23,100 కోట్లు (రిలయన్స్ ఇండస్ట్రీస్)
- కుమార్ మంగళం బిర్లా కుటుంబం: రూ. 6,47,700 కోట్లు (ఆదిత్య బిర్లా గ్రూప్)
- జిందాల్ కుటుంబం: రూ. 5,70,900 కోట్లు (జె.ఎస్.డబ్ల్యు స్టీల్)
- బజాజ్ ఫ్యామిలీ: రూ. 5,64,200 కోట్లు (బజాజ్ గ్రూప్)
- మహీంద్రా కుటుంబం: రూ. 5,43,800 కోట్లు (మహీంద్రా & మహీంద్రా)
- నాడార్ కుటుంబం: రూ. 4,68,900 కోట్లు (హెచ్‌సిఎల్ టెక్నాలజీస్)
- మురుగప్ప కుటుంబం: రూ. 2,92,400 కోట్లు (చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ)
- ప్రేమ్‌జీ కుటుంబం: రూ. 2,78,600 కోట్లు (విప్రో)
- అనిల్ అగర్వాల్ కుటుంబం: రూ. 2,55,000 కోట్లు (హిందూస్తాన్ జింక్)
- డాని, చోక్సీ & వకీల్ కుటుంబాలు: రూ. 2,20,900 కోట్లు (ఏషియన్ పెయింట్స్)



# ఇళ్ల విక్రయాలపై టారిఫ్ ప్రభావం!

భారత ఎగుమతులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దేశీయ మార్కెట్లో అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలను ప్రభావితం చేయొచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది. అధిక టారిఫ్‌లు చిన్న వ్యాపారాలకు విఘాతం కలిగించొచ్చంటూ.. ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులే రూ.45 లక్షల్లోపు ధరల ఇళ్ల కొనుగోలుదారుల్లో ఎక్కువగా ఉన్నట్టు గుర్తు చేసింది. 'యూఎస్‌కు వస్తు ఎగుమతుల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) అధిక వాటా కలిగి ఉన్నాయి. అధిక టారిఫ్‌లతో వీటి ఉత్పత్తులకు ఉన్న పోటీ తగ్గిపోతుంది. దీంతో వాటికి ఆర్డర్లు తగ్గుతాయి. ఆయా సంస్థల ఉద్యోగులపై ప్రభావం పడుతుంది'అని అనరాక్ వివరించింది. అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం అన్నవి కనిష్ట స్థాయికి పడిపోయినట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో 2025 మొదటి ఆరు నెలల్లో 1.9 లక్షల యూనిట్ల ఇళ్లు అమ్ముడవగా.. ఇందులో అందుబాటు ధరల విభాగంలో విక్రయాలు 34,565 యూనిట్లుగానే ఉన్నట్టు పేర్కొంది.

**కోలుకోవడానికి ఇబ్బందులు..**

'రూ.45 లక్షలు లేదా అంతకంటే తక్కువ ధరల్లోని ఇళ్లు ఈ విభాగం కిందకు వస్తాయి. ఈ విభాగంపై కరోనా విపత్తు పెద్ద ప్రభావాన్నే చూపించింది. కోలుకునేందుకు ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటోంది. ఈ విభాగం పట్ల ఉన్న కొద్దో గొప్ప ఆశలను ట్రంప్ అధిక టారిఫ్‌లు ఆవిరి చేస్తున్నాయి' అని అనరాక్ రీసెర్చ్ ఈడీ ప్రశాంత్ ఠాకూర్ వివరించారు. భారత జీడీపీలో ఎంఎస్ఎంఈలు 30 శాతం వాటా కలిగి ఉన్నాయన్న ప్రభుత్వ గణాంకాలను అనరాక్ ప్రస్తావించింది. అలాగే ఎగుమతుల్లో 45 శాతం వాటా ఆక్రమిస్తున్నట్టు తెలిపింది. అమెరికా 50 శాతం టారిఫ్‌లతో ఎంఎస్ఎంఈలు, వాటి సిబ్బందిపై గణనీయమైన ప్రభావం పడుతుందని అంచనా వేసింది. ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈల్లో పనిచేసే సిబ్బంది అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో ప్రధాన వినియోగదారులుగా ఉన్నట్టు తెలిపింది. దీంతో ఈ విభాగంలో డిమాండ్‌పై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఇది కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణపైనా ప్రభావం చూపిస్తుందని వివరించింది.



# ఆఫీస్‌కు వస్తున్నారా?..

## ఎలా రావాలో చెప్పిన ఇన్ఫోసిస్

బెంగళూరులో కొత్తగా ప్రారంభించిన నమ్మ మెట్రో ఎల్లో లైన్ సర్వీసులకు భారతదేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ మద్దతుగా నిలుస్తుంది. సుస్థిర ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి కంపెనీ ఉద్యోగులను రోడ్డు రవాణాకు బదులుగా మెట్రోలో ప్రయాణించాలని కోరింది. జయనగర్‌లోని ఆర్‌వీ రోడ్డు నుంచి ఎలక్ట్రానిక్ సిటీ ద్వారా బొమ్మసంద్రను కనెక్ట్ చేసేలా 19.14 కిలోమీటర్ల ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఇటీవల ప్రారంభించారు. రోడ్డు ప్రయాణానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఈ మెట్రో మార్గాన్ని ప్రమోట్ చేస్తూ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు అంతర్గత ఈమెయిల్ పంపించింది. భారీ ట్రెఫిక్ జామ్‌లతో సతమవుతున్న బెంగళూరులో పలు ప్రాంతాలకు సులువుగా ప్రయాణించేలా మెట్రో సర్వీసులు అందుబాటులో వచ్చిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. కోనప్పన అగ్రహార స్టేషన్ తన ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌కు కీలక నోడ్‌గా ఉంటుందని కంపెనీ తెలిపింది. స్టేషన్ నుంచి ఇన్ఫోసిస్ మెట్రో ప్లాజా వరకు ప్రత్యేకమైన స్కైవాక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పింది. ఇది క్యాంపస్‌కు ప్రత్యక్ష, సురక్షితమైన ప్రవేశాన్ని అందిస్తుందని పేర్కొంది. ఉద్యోగుల కోసం మెట్రో ప్లాజా వద్ద ఐడీ ఆధారిత ఎంట్రీ ప్రోటోకాల్స్ పాటించనున్నట్లు స్పష్టం చేసింది.





# ఫెడరల్ నియంత్రణలోకి వాషింగ్టన్ డీసీ

**వాషింగ్టన్:** దేశ రాజధాని వాషింగ్టన్ డీసీ హింసాత్మక గ్యాంగ్‌లు, రక్తపిపాసులైన నేరగాళ్లతో నిండిపోయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు రాజధానిలోని పోలీసు విభాగాన్ని ఫెడరల్ నియంత్రణలోకి తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసులకు తోడుగా 800 మంది నేషనల్ గార్డ్స్‌ను కూడా మోహరిస్తామని ప్రకటించారు. నేషనల్ గార్డులు శాంతిభద్రతలను, పౌరులకు రక్షణను కల్పిస్తారన్నారు. అవసరమైతే మరింత మంది నేషనల్ గార్డులను తీసుకొస్తామని పేర్కొన్నారు. సోమవారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. నగరంలో నేరాల రేటు 2024లో 30 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందంటూ గణాంకాలు చెబుతుండగా నేరాలమయంగా మారిందని వ్యాఖ్యానించడం గమనార్హం. ట్రంప్ ఈ వారంలోనే ఫెడరల్ బలగాలు రాజధానికి చేరుకుంటాయని రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు.

**నిరాశ్రయులు నగరం విడిచి వెళ్లిపోవాలి**

'నివాసం లేని వారు వెంటనే నగరం వదిలి వెళ్లిపోవాలి. వారి కోసం నగరానికి దూరంగా స్థలాలిచ్చాం. నేరగాళ్లూ, మీరు మాత్రం ఎక్కడికీ వెళ్లొద్దు, మీరుండాల్సింది జైలులోనే. మేమే మిమ్మల్ని అందులో ఉంచుతాం'అని ట్రంప్ అంతకుముందు సొంత ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. వీధుల్లో, పార్కుల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలంటూ ఫెడరల్ పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు.

# నా ప్రజలను, నా కుటుంబాన్ని మీకు అప్పగిస్తున్నా..

## ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరణించిన అనాస్ జమాల్ అల్-షరీఫ్ హృదయాలను కదిలిస్తున్న ఆయన చివరి సందేశం

**గాజా:** గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఐదుగురు అల్ జజీరా జర్నలిస్టులు మృతిచెందారు వారిలో అనాస్ జమాల్ అల్-షరీఫ్ కూడా ఉన్నారు. ఈ దాడిలో మరణించడానికి ముందు అనాస్ రాసిన మెసేజ్‌ను అతడి మిత్రుడు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ సందేశం ప్రజల హృదయాలను కదలిస్తోంది. అది చదివితే గుండె బరువెక్కడం ఖాయం. అన్సార్ సందేశం ఏమిటంటే...

**వారిని అల్లా క్షమించడు**

"ఇది నా వీలునామా. నా చివరి సందేశం. నా మాటలు మీకు చేరాయంటే దాని అర్థం నన్ను చంపడంలో, నా గొంతు మూగబోయేలా చేయడంలో ఇజ్రాయెల్ సైన్యం విజయవంతమైనట్లే. మీకు శాంతి సౌఖ్యాలు కలగాలని కోరుకుంటున్నా. అల్లా దయ, ఆశీస్సులు మీకు లభించాలి. నా ప్రజలకు మద్దతుగా, వారి గొంతుకగా ఉండడానికి నా బలం మొత్తం ఉపయోగించానని, చేయగలిగినదంతా చేశానని అల్లాకు తెలుసు. జబాలియా శరణార్థి శిబిరంలోని ఇరుకు సందుల్లో కళ్లు తెరిచినప్పటికీ నా ప్రజల కోసం ఆరాటపడుతున్నా.

నా జీవిత కాలాన్ని అల్లా పొడిగిస్తాడని ఆశపడుతున్నా. దానివల్ల నా స్వస్థలం ఆక్రమిత అస్కెలాన్(అల్-మజ్‌దాల్)కు చేరుకొని, కుటుంబంతో, ప్రియమైనవారితో గడపగలను. కానీ, అల్లా ఆదేశమే ఫైనల్. దానికి తిరుగులేదు. ఇన్నాళ్లూ ఎన్నో బాధలు అనుభవించా. కష్టాలు నష్టాలు నాకు కొత్త కాదు. ఎంతో కోల్పోయా. ఉన్నది ఉన్నట్లుగా చెప్పడంలో నాకు ఎలాంటి సంకోచం లేదు. మా చావులకు కళ్లారా చూస్తున్నవారిని, మా మారణాలను ఆమోదిస్తున్నవారిని, ఇన్ని దారుణాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయినవారిని, గత ఏడాదిన్నరగా మా గడ్డపై మా పిల్లలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, హింసాకాండను, మారణహోమాన్ని ఆడ్డుకోనివారిని అల్లా క్షమిస్తాడని నేను అనుకోవడం లేదు.

**నా బిడ్డ నా కంటి వెలుగు**

పాలస్తీనా అంటే మాకెంతో ప్రేమ. ముస్లిం ప్రపంచం అనే కిరీటంలో విలువైన రత్నం పాలస్తీనా. ప్రపంచంలో ప్రతి స్వేచ్ఛా జీవి గుండె చప్పుడు పాలస్తీనా. మా ప్రజలను మీకు అప్పగిస్తున్నా. కలలు కనడానికి సమయం లేని, స్వేచ్ఛగా, శాంతితో జీవించే అవకాశం లేని మా



అమాయక చిన్నారులను అప్పగిస్తున్నా. మా ప్రజల దేహాలు వేలాది టన్నుల బరువు కింద ఛిద్రమైపోయాయి. ఇజ్రాయెల్ బాంబులు, క్షిపణులు వారి శరీరాలను ముక్కలు చేశాయి. ఆ ముక్కలన్నీ వెదజల్లినట్లుగా దూరంగా పడిపోయాయి. నిర్బంధాలు, హెచ్చరికలు మిమ్మల్ని ఆపకూడదు. సరిహద్దులు మీకు అడ్డంకి కాకూడదు.

మీరంతా గొంతు విప్పండి. మా కోసం మాట్లాడండి. మా భూమి విముక్తికి, మా ప్రజలకు మధ్య వారధిగా మారండి. ఆక్రమణకు గురైన మా భూభాగంపై గౌరవం, స్వేచ్ఛ పరిఢవిల్లేదాకా గొంతు విప్పుతూనే ఉండండి. మా కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోండి. వారిని మీకు అప్పగిస్తున్నా. నా ముద్దుల కూతురు షామ్ జాగ్రత్త. ఆమె నా కంటి వెలుగు. ఆమె ఎదుగుదలను కళ్లారా చూసే అదృష్టం నాకు దక్కలేదు. అది కలగానే మిగిలిపోయింది. నా కుమారుడు సలాహ్‌ను కూడా అప్పగిస్తున్నా. నా భారాన్ని మోసే, ఆశయాన్ని నెరవేర్చే బలవంతుడిగా మారేదాకా అతడికి అండగా ఉండాలనుకున్నా. ఇక నా తల్లి బాధ్యత కూడా మీదే. ఆమె ఆశీస్సులు, ప్రార్థనలే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చాయి. ఆమె ఇచ్చిన వెలుగే నాకు దారిగా మారింది. నా తల్లికి బలాన్ని ఇవ్వాలని అల్లాను ప్రార్థిస్తున్నా. అల్లా ఆమెను కరుణించాలి. నా జీవన సహచారి ఉమ్ సలాహ్ బాధ్యతను సైతం మీ చేతుల్లో పెడుతున్నా. ఈ యుద్ధం నన్ను నా భార్య నుంచి దూరం చేసింది. అయినప్పటికీ మా బంధానికి ఆమె కట్టుబడి ఉంది. ఆమె తన బలం, విశ్వాసంతో నా బాధ్యతలను స్వీకరించి, భుజాన వేసుకొని మోసింది.

**అల్లా తర్వాత మీరే రక్షణ**

నా కుటుంబానికి అల్లా తర్వాత మీరే రక్షణగా నిలవాలి. ఒకవేళ నేను మరణిస్తే, నా ఆశయాలకు కట్టుబడి ప్రాణాలు పోగొట్టుకుంటే.. అల్లా ముందుకు వెళ్లి, మీ ఆదేశాలు శిరసావహించానని చెబుతా. శాశ్వతంగా అల్లా సన్నిధికి చేరడం సంతోషకరమే కదా. అమర వీరుల్లో ఒకడిగా నన్ను చేర్చుకో అని అల్లాను వేడుకుంటున్నా. నా పాపాలన్నింటినీ క్షమించాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా ప్రజలకు, నా కుటుంబానికి కలిపించే స్వేచ్ఛా మార్గాన్ని మెరిపించడానికి నా రక్తాన్ని ఒక కాంతిగా మార్చాలని ప్రార్థిస్తున్నా. మీ ప్రార్థనల్లో గాజాను మర్చిపోవద్దు... నన్నూ మర్చిపోవద్దు."


**- అనాస్ జమాల్ అల్–షరీఫ్**

# పార్క్ చేసిన విమానాన్ని ఢీకొన్న మరో విమానం



**కాలిస్పెల్:** అమెరికాలోని మోంటానా విమానాశ్రయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ల్యాండ్ అవుతున్న ఒక చిన్న విమానం ఆగి ఉన్న మరో విమానంపైకి దూసుకెళ్లింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదని అధికారులు తెలిపారు. కాలిస్పెల్ పోలీస్ చీఫ్ జోర్డాన్ వెనెజియో, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తెలిపిన వివరాల ప్రకారం నలుగురు ప్రయాణికులతో వెళ్తున్న సింగిల్ ఇంజిన్ విమానం కాలిస్పెల్ సిటీ విమానాశ్రయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ల్యాండ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సోకాటా టీబీఎం 700 టర్బోప్రాప్ విమానం నేలపై ప్రయాణికులు లేని ఒక ఖాళీ విమానాన్ని ఢీకొన్నదని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగి, ఆ ప్రాంతం అంతటినీ పొగ కమ్ముకుంది. మోంటానా విమానాశ్రయం 30 వేల జనాభా కలిగిన కాలిస్పెల్ నగరానికి దక్షిణంగా ఉంది. ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించిన విమానం మంటల్లో చిక్కుకుంది. ఈ సమయంలో ఆ విమానం నుంచి పైలట్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వీరిలో ఇద్దరు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయని, విమానాశ్రయంలోనే వారికి చికిత్స అందించారని అధికారులు తెలిపారు.

# మోదీకి జెలెన్‌స్కీ ఫోన్



**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమ వారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని నగరాలు, గ్రామాలపై జరుగుతున్న రష్యా సైన్యం దాడుల గురించి వివరించారు. కాల్పుల విరమణకు రష్యా సిద్ధంగా లేనట్లు కనిపిస్తోందని అన్నారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతికి చొరవ చూపాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశం సందర్భంగా వ్యక్తిగతం భేటీ కావాలని జెలెన్‌స్కీ, మోదీ నిర్ణయించుకున్నారు. నరేంద్ర మోదీతో సంభాషణ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత్, ఉక్రెయిన్ మధ్య ద్వైపాకిక్ష సహకా రంతోపాటు దౌత్య సంబంధాల్లో పురోగతిపై చర్చించామని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణకు తెరప డాలని, సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. అందుకు భారత్ సహకారం అవసరమని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్‌కు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నందుకు ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌కు అమెరికా చేసిన హెచ్చరికల అంశం కూడా జెలెన్‌స్కీ, మోదీ మధ్య చర్చకు వచ్చింది. భారత్ చెల్లిస్తున్న డబ్బులతో రష్యా సైన్యం తమపై దాడులు చేస్తోందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోదీ సైతం 'ఎక్స్'లో ప్రతిస్పందించారు. ఉక్రెయిన్- రష్యా మధ్య శాంతికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామన్నారు.



## కింగ్డమ్‌తో ఆకట్టుకున్నాడు..
# ఇప్పుడు ఇలా

ప్రస్తుతం రాజమౌళితో సినిమా చేస్తున్న మహేశ్ బాబు.. ఆ బిజీలో ఉన్నాడు. మరోవైపు నిర్మాతగా కొత్త మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ మేరకు డీటైల్స్ బయటపెట్టారు. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేశ్ మహా చాన్నాళ్ల తర్వాత మళ్లీ దర్శకత్వం చేస్తున్నాడు. ఇంతకీ ఈ మూవీ సంగతేంటి? హీరో ఎవరు? టాలీవుడ్‌లో హీరో కమ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకున్న సత్యదేవ్.. ఇటీవలే 'కింగ్డమ్'లోనూ హీరోకి సరిసమానంగా ఉండే నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలో ఆకట్టుకున్నాడు. ఇప్పుడు వెంకటేశ్ మహా దర్శకత్వంలో కొత్త సినిమా చేయబోతున్నాడు. దీనికి 'రావు బహదూర్' అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో పాటు ఫస్ట్ లుక్ కూడా వదిలారు. సత్యదేవ్.. 'రావు బహదూర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌లో డఫరెంట్‌గా కనిపించాడు. చెప్పాలంటే గుర్తుపట్టడం చాలా కష్టం. ముసలి రాజు గెటప్‌లో అస్సలు గుర్తుపట్టలేనట్లు ఉన్నాడు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్ లైన్‌తో ఈ మూవీ తీస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేస్తున్నట్లు కూడా ప్రకటించేశారు. గతంలో సత్యదేవ్‌వెంకటేశ్ మహా 'ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య' అనే మూవీ చేశారు. కాకపోతే అది రీమేక్. ఇప్పుడు ఒరిజినల్ కంటెంట్‌తో వస్తున్నారు. ఈసారి ఏం మ్యాజిక్ చేస్తారో చూడాలి?

# ఒక్కో టికెట్ ఏకంగా వేల రూపాయలా?

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ మోస్ట్ అవైటేడ్ చిత్రం కూలీ. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ మూవీ మరో రెండు రోజుల్లో థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే టికెట్స్ అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ కాగా.. కొద్ది నిమిషాలకే హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి. ఇండియాతో పాటు ఓవర్‌సీస్‌లోనూ రికార్డ్ స్థాయిలో టికెట్స్ బుక్కైపోతున్నాయి. ఇక తమిళనాడులో ఏకంగా రికార్డ్ ధరకు టికెట్స్ విక్రయిస్తున్నారు. కూలీ మూవీ క్రేజ్‌ను కొందరు దళారులు క్యాష్ చేసుకుంటున్నారు. చెన్నైలో కూలీ టిక్కెట్స్‌ను బ్లాక్‌లో ఏకంగా రూ.4500లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ డే ఫస్ట్ షోలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఎంత రేటుకైనా అభిమానులు ఎగబడి కొనేస్తున్నట్లు టాక్. పొల్లాచ్చిలో ఓ థియేటర్ సిబ్బంది మొదటి షో టికెట్లను రూ.400కు అమ్ముతున్నట్లు తెలిసింది. టికెట్ రేట్లపై రజినీకాంత్ వీరాభిమాని ప్రభాకర్ మాట్లాడుతూ.. "చెన్నైలోని అన్ని ప్రముఖ థియేటర్లలో నేను నా అదృష్టాన్ని పరీక్షించుకున్నా. టికెట్స్ రూ.600, రూ.1,000ల నుంచి అత్యధికంగా రూ.4,500 వరకు అమ్ముతున్నారు. మొదటి షో కోసం టిక్కెట్ల యాప్‌ల ద్వారా బుక్ చేసుకోలేకపోతున్నా. ఎందుకంటే ఆ టికెట్స్ అన్నీ బ్లాక్ చేశారు. నాలాంటి అభిమానులకు టిక్కెట్లను బ్లాక్‌లో కొనడం కష్టం. మొదటి షోలు ముగిసే వరకు వేచి ఉండటం తప్ప వేరే మార్గం లేదు." అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కేవలం తమిళనాడులోనే కాదు.. 'కూలీ' డబ్బింగ్ వర్షన్‌లకు కూడా టిక్కెట్ల ధరలు బాగా పెరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమిళంతో పాటు తెలుగులో విడుదలవుతోంది. రెండు రాష్ట్రాలు తెల్లవారుజామున షోలను అనుమతివ్వడంతో టికెట్ ధరలు భారీగానే పెంచేశారు. ఇక బెంగళూరులో సింగిల్ స్క్రీన్లలో దాదాపు ఒక్కో టికెట్ రూ. 2,000 వరకు అమ్ముడవుతున్నాయి. బెంగళూరులో టిక్కెట్ల ధర మల్టీప్లెక్స్‌ల్లో ఒక్కో టికెట్ రూ. 500 పైగానే ఉన్నాయి. ముంబయి థియేటర్లలో 'కూలీ' టికెట్ ధరలు రూ. 250 నుంచి రూ. 500 మధ్య ఉన్నాయి. అడ్వాన్స్ బుకింక్స్ చూస్తుంటే ఈ సినిమా మొదటి రోజే రూ. 150 కోట్లు దాటే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు.



## కూలీ కోసం హాలీడే, ఫ్రీ టికెట్..
## ఇది కదా రజనీ క్రేజ్!

రజనీకాంత్ సినిమా వస్తుందంటే చాలు ఇండియాలోనే కాదు ఇతర దేశాల్లోనూ సంబరాలు మొదలవుతాయి. జపాన్, మలేషియా, సింగపూర్ లాంటి దేశాల్లో రజనీకాంత్‌కు ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.ఇక ఇండియాలో చెప్పనక్కర్లేదు. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ దాక అంతటా ఆయనకు అభిమానులు ఉన్నారు. తొలి రోజు ఆయన సినిమా చూసేందుకు వేలల్లో ఖర్చు పెట్టిమరీ టికెట్ కొనేవాళ్లు చాలా మందే ఉన్నారు. సినిమా రిలీజ్ రోజు చాలా మంది ఉద్యోగస్తులు ఆఫీస్‌కి సెలవు పెడతారు. బాస్‌కి ఏదో ఒక కారణం చెప్పి ఆ రోజు ఆఫీస్‌కి డుమ్మా కొట్టేందుకు ప్రయత్నిస్తారు. ఇదంతా ఎందుకు అనుకుందో ఏమో కానీ..ఓ కంపెనీ ఏకంగా తమ ఉద్యోగస్తులకు హాలీడేనే ప్రకటించింది. సౌత్‌తో పాటు ఇండియా వ్యాప్తంగా పలు బ్రాంచ్‌లు కలిగి ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీ రజనీకాంత్ కొత్త సినిమా 'కూలీ' రిలీజ్ రోజు(ఆగస్ట్ 14) తమ ఉద్యోగులకు వేతనంతో కూడా సెలవును ప్రకటించింది. అంతేకాదు రిలీజ్ రోజు తమ ఎంప్లాయిస్‌కి ఉచితంగా టికెట్‌ని కూడా అందిస్తున్నట్లు ప్రకటించింది.దీంతో పాటు రజనీకాంత్ 50 ఏళ్ల సినీ కెరీర్‌ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అనాథ ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టబోతున్నారట. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఆ కంపెనీపై తలైవా అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కూలీ విషయానికొస్తే.. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నాగార్జున విలన్‌గా నటించాడు. సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్, శ్రుతి హాసన్, సౌబిన్ షాహిర్ లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ పాటలు ఇప్పటికే బ్లాక్ బస్టర్స్ అయిపోయాయి. లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌పై రజిని అభిమానులు బోలెడన్ని ఆశలు పెట్టుకున్నారు. మరి ఫలితం ఏమవుతుందనేది చూడాలి.



## కాంతాతో
# వెలిగిపోతుందా?

ప్రతిభ ఎక్కడున్నా ప్రోత్సహిస్తుంది సినిమా. ముఖ్యంగా నటీమణులకు అవకాశాలు తలుపుతడతాయి. అందుకు కొంచెం అందం, కాస్త అదృష్టం ఉంటే చాలు, ఇండియన్ సినిమానే ఏలేయవచ్చు. అలా యువ కథానాయకి భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు పాన్ ఇండియా ఇమేజ్‌పై కన్నేశారనే చెప్పవచ్చు. 26 ఏళ్ల ఈ మహారాష్ట్ర పరువాల బ్యూటీ 2023లోనే నటిగా తెరంగ్రేటం చేశారు. అలా ముందుగా హిందీలో నటించిన భాగ్యశ్రీ బోర్సేకు వెంటనే టాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. అక్కడ రవితేజకు జంటగా మిస్టర్ బచ్చన్ నటించారు. ఈ చిత్రం విజయాన్ని సాధించకపోకపోయినా ఈ అమ్మడు మాత్రం డాన్స్, అందాలారబోతలతో పాపులర్ అయ్యారు. తరువాత కింగ్డమ్‌లో విజయ్ దేవరకొండ సరసన నటించారు. ఆ చిత్రం సక్సెస్ అయ్యింది. ఇప్పుడు కాంతా అనే బహుభాషా చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో దుల్కర్‌సల్మాన్, సముద్రఖని ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. స్పిరిట్ మీడియా సంస్థ, వేఫారర్ ఫిలింస్ సంస్థతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాంతా చిత్రం కన్నడం, తెలుగు, తమిళ భాషల్లో విడుదలకు ముస్తాబవుతోంది. ప్రతిభావంతులైన చిత్ర టీమ్‌తో కలిసి నటిస్తున్న కాంతా వంటి చిత్రం ద్వారా తమిళ ప్రేక్షకులకు పరిచయం కావడం సంతోషంగా ఉందన్నారు. కాగా ఈ చిత్రంలోని భాగ్యశ్రీబోర్సే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఈమె గెటప్ పలువురిని ఆకట్టుకుంది. ఈ భామ కోలీవుడ్‌లో ఏమాత్రం రాణిస్తారో వేచి చూద్దాం.

# ఊ
# అంటారా?

బ్లాక్‌బస్టర్ సినిమా 'రంగస్థలం' తర్వాత హీరో రామ్‌చరణ్, హీరోయిన్ సమంత మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ... వీరిద్దరూ ఈసారి హీరో, హీరోయిన్లుగా నటించడంలేదట. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్ కోసం మేకర్స్ పలువురు హీరోయిన్స్ పేర్లను పరిశీలిస్తున్నారట. ఇప్పటికే పూజా హెగ్డే, శ్రీలీల వంటి హీరోయిన్ల పేర్లు వినిపించగా, తాజాగా సమంత పేరు తెరపైకి వచ్చింది. ఇక అల్లు అర్జున్ 'పుష్ప ది రైజ్' (2021) సినిమాలో సమంత చేసిన 'ఊ అంటావా మావ...' స్పెషల్ సాంగ్ బాగాపాపులర్ అయిన సంగతి తెలిసిందే.

ఈపాట తర్వాత సమంత మరో స్పెషల్ సాంగ్ చేయలేదు. మరి... రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకపాటకు సమంత 'ఊ' అంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాల సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' సినిమా మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com